


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం – ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 152 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శనివారం 30 ఆగస్టు 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్






# జపాన్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం

## చంద్రయాన్ మిషన్ కోసం కలసి పరిశోధనలు

## ప్రధాని పర్యటన సందర్భంగా రెండు దేశాల అంగీకారం

**న్యూఢిల్లీ,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

అంతరిక్షరంగంలో గొప్ప విజయాలు సాధిస్తోన్న భారత్ కీలక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. చంద్రుడిపై పరిశోధనల కోసం చేపట్టే చంద్రయాన్–5 మిషన్ కోసం జపాన్‌తో కలిసి పనిచేయనుంది. ఇందుకోసం ఇరుదేశాల అంతరిక్ష సంస్థలు కలిసి పనిచేస్తాయని ప్రధాని మోదీ వెల్లడించారు. రెండు ఆసియా దేశాల మధ్య పెరుగుతోన్న వ్యూహాత్మక, శాస్త్రీయ భాగస్వామ్యానికి ఈ ప్రకటన నిదర్శనంగా కనిపిస్తోంది. ఆర్థిక సహకారం, ఆరోగ్యం, ఏఐ, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడంపై ఇరు దేశాల ప్రధానులు ఈ పర్యటనలో భాగంగా ప్రధానంగా దృష్టిసారించారు. చంద్రయాన్–5 మిషన్ చంద్రుడి ఉపరితలం, పర్యావరణంపై శాస్త్రీయ అవగాహనను పెంచుతుందని భావిస్తున్నారు. జపాన్ తో కలిసి పనిచేయడం ద్వారా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకునే వీలు కలగనుంది. ఇదిలాఉంటే.. చంద్రుడిపై పరిశోధనల కోసం చేపట్టే చంద్రయాన్–5 మిషన్‌కు కొన్నినెలల క్రితం కేంద్రం ఆమోదం తెలిపింది. 2023లో ప్రయోగించిన చంద్రయాన్–3లో భాగంగా 25 కిలోల ప్రజ్ఞాన్ రోవర్‌ను జాబిల్లిపై దింపామని ఆ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ పేర్కొన్నారు. చంద్రయాన్–5లో మాత్రం 250 కిలోల రోవర్‌ను చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ చేస్తామన్నారు. జపాన్‌తో కలిసి ఈ ప్రాజెక్టును చేపడతామని వెల్లడించారు. ఇప్పుడు దీనిపై మోదీ స్వయంగా ప్రకటన చేశారు. ఇక, జాబిల్లి నుంచి నమూనాలను భూమికి రప్పించేందుకు ఉద్దేశించిన చంద్రయాన్–4 మిషన్‌ను 2027లో ప్రయోగించనున్నారు.



# మెరుగైన బోధన దిశగా ప్రమాణాలు

## అన్ని విద్యా సంస్థల్లో ఫేషియల్ రికగ్నేషన్

## విద్యాశాఖపై ఐసీసీలో సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని.. విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు మరింత పెంచాలని రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు– ప్రొఫెషనల్ విద్యాసంస్థల్లో లోటు–పాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యాశాఖపై ఐసీసీలో సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వేర్వేరు విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలు, పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనం కోసం ఒకే విభాగం కింద ఉండాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని.. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు.

2

# నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ

## కాళేశ్వరం, బీసీ రిజర్వేషన్లపై చర్చ

## ఏర్పాట్లను సమీక్షించిన స్పీకర్

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శనివారం నుంచి అంటే.. ఆగస్టు 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై చర్చించ నున్నారు.

2

## రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు బాగేంటేనే..

# దేశం బాగుంటుంది



- రాష్ట్రాలు బలపడితేనే.. దేశం పటిష్టంగా ఉంటుంది
- -జీఎస్టీ రేట్ రేషనైలేజేషన్‌తో రెవెన్యూపై ప్రభావం
- -జీఎస్టీ నష్టాలకు కేంద్రమే ప్రత్యామ్నాయం చూడాలి
- -తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిమాండ్

**న్యూఢిల్లీ,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

రేట్ రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రాలకు రెవెన్యూ తగ్గే ప్రమాదం ఉందని డిప్యూటీ–సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం వ్యవహరించాలని అన్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో జీఎస్టీ రేషనలైజేషన్ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు బాగేంటేనే.. దేశం బాగుంటుందని తెలియజేశారు.

2

# సుప్రీం జడ్జిలుగా జస్టిస్ అరాధే, జస్టిస్ పంచోలీలు

## నూతన జడ్జిలతో ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్

**న్యూఢిల్లీ,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలు సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణస్వీకారం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ శుక్రవారం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇద్దరు కొత్త జడ్జీల నియామకంతో కోర్టులో పూర్తి స్థాయి జడ్జీల సంఖ్య తిరిగి 34కి చేరుకుంది. 2025 నవంబర్ 23న సిజెఐ బి.ఆర్.గవాయ్ పదవీవిరమణ చేసే వరకు సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ విధులు నిర్వహించనుంది.

2




# హైదరాబాద్‌లో నిమజ్జన సందడి

## ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలు అమలు

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జనాలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో వినాయక నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. గణేష్ నిమజ్జనాల సందర్భంగా శుక్రవారం నుంచి సెప్టెంబర్ 5 వరకు ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాలను బట్టి ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా పీవీఎన్‌ఆర్ మార్గ్‌లలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు– చేశారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలను కవాడిగూడ మీదుగా దారి మళ్లించారు. ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ స్టేడియం దగ్గర నిమజ్జనాల కోసం క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన ఊరేగింపునకు సీసీ కెమెరాలు, డ్రోన్లు, కోడ్ స్కిక్కర్లతో పర్యవేక్షిస్తున్నారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా శుక్రవారం నుంచి హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు– పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.

2



2

# ఆర్థిక పరిస్థితిపై తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం

## ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. రాష్ట్రం ప్రతి నెలా రూ.7,000 కోట్ల రుణ వడ్డీ చెల్లిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అయితే, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ఈ వాదన తప్పు అని తేల్చిందని స్పష్టం చేశారు.

# నేటినుంచి అసెంబ్లీ సమావేశాలు

## స్వతంత్ర ఎమ్మెల్యేగా హాజరవుతున్నా: రాజాసింగ్

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

బిజెపికి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు తాను స్వతంత్ర ఎమ్మెల్యేగా హాజరవుతానని గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు. తాను ప్రస్తుతం ఇండిపెండెంట్ ఎమ్మెల్యేనని ఆయన తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా తనకు ఇప్పుడు స్వేచ్ఛ ఎక్కువ ఉందన్నారు.

2

# తీరనున్న యూరియా కష్టాలు

## -ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి

## -వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

యూరియా కోసం ఎదురు చూస్తోన్న రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శుభవార్త చెప్పారు. యూరియా సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయని.. ఇందులో భాగంగానే వచ్చే రెండు రోజుల్లో గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్ నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లికి 21,325 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. 2025, సెప్టెంబర్ మొదటి వారంలోగా గంగవరం, దామ్ర, కరాయికల్ పోర్టుల నుంచి మరో 29,700 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని చెప్పారు. పోర్టుల నుంచి ఆదిలాబాద్, జడ్చర్ల, గద్వాల, వరంగల్, మిర్యాలగూడ, పందిళ్లపల్లి, సనత్ నగర్, గజ్వేల్ ప్రాంతాలకు యూరియా చేరుకుంటుందని.. అక్కడి నుంచి డిమాండ్ పరంగా జిల్లాలకు పంపిణీ చేస్తామని తెలిపారు. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షం కురిసిన విషయం తెలిసిందే. ఈ వర్షానికి రాష్ట్రంలోని చాలా జిల్లాలో తీవ్రంగా పంట దెబ్బతిన్నది. ఈ క్రమంలో శక్రవారం సాయంత్రంలోగా పంట నష్టంపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. బృందాలుగా ఏర్పడి జిల్లాలలో పర్యటించి, పంట నష్టం వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు వరద ప్రభావిత జిల్లా కలెక్టర్లతోమంత్రి తుమ్మల మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం యూరియాను సరఫరా చేసిందని పేర్కొన్నారు. యూరియా కొరతతో కొంతమంది రాజకీయలు చేశారని మండిపడ్డారు.

మొదటిపేజీ తరువాయి

## మెరుగైన బోధన దిశగా ప్రమాణాలు

కం-టైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. కంటైనర్లపై సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవసరమైతే కాంట్రాక్టు పద్ధతిలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని... ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. కం-టైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. కం-టైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సీఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టు-బడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు- విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

### రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు బాగేంటేనే..

## దేశం బాగుంటుంది

రేషనలైజేషన్ ను ఆహ్వానిస్తూనే రాష్ట్రాలకు జరిగే నష్టానికి..పరిహారం చెల్లించే మార్గాలను కేంద్రం ఆలోచించాలని కోరారు. సెప్టెంబర్ 3న మరోసారి ఢిల్లీలో 8 రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తమ డిమాండ్లు లేవనెత్తాలని కేంద్రం నిర్ణయం తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు.జీఎస్టీ సంస్కరణలతో తెలంగాణ రాష్ట్రానికి రూ.7వేల కోట్లు- నష్టం వస్తుందని అంచనా ఉన్నట్లు- మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దిల్లీలో జరిగిన 'జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్ష పార్టీ పాలిత రాష్ట్రాల సమావేశం'లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ తరపున భట్టి విక్రమార్క హాజరుకాగా.. తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఝార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు. జీఎస్టీ సంస్కరణలతో కలిగే నష్టానికి పరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా మంత్రులు డిమాండ్ చేశారు. కొత్త జీఎస్టీ ప్రతిపాదనలతో మొత్తంగా రూ.2లక్షల కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని అంచనా వేశారు. జీఎస్టీ కౌన్సిల్ భేటీలో తమ ప్రతిపాదనలు సమర్పిస్తామని చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

## నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ

తొలిరోజు దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సంతాపం ప్రకటిస్తారు. నేటి నుండి ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసుశాఖ ఉన్నతాధికారుల తో శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముందస్తు సమావేశం నిర్వహించారు. శాసన పరిషత్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ- ఛైర్మన్ శ్రీ బండా ప్రకాష్ ముదిరాజ్ ,లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెక్రటరీ రఘునందన్ రావు, అడిషనల్ సెక్రటరీ (ఫైనాన్స్)- రాయ రవి, డైరెక్టర్ (ప్రోటోకాల్)- శివలింగయ్య హాజరయ్యారు. హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ- రవి గుప్తా, మహేష్ భగవత్, విక్రమ్ సింగ్ మాన్, సైబరాబాద్,రాచకొండ కమిషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజి- కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్- కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డిలు హాజరయ్యారు.

మొదటిపేజీ తరువాయి

## సుప్రీం జడ్జిలుగా జస్టిస్ అరాధే, జస్టిస్ పంచోలీలు

అయితే జస్టిస్ పంచోలీని సుప్రీంకోర్టుకు ఎంపిక చేస్తూ కొలీజీయం తీసుకున్న నిర్ణయంపై ఆసభ్యుల్లో ఒకరైన జస్టిస్ బి.వి.నాగరత్న భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. భారత హైకోర్టు జడ్జీల సీనియారిటీ- జాబితాలో జస్టిస్ పంచోలి 57వ స్థానంలో ఉన్నారని, ఆయనకంటే సీనియర్లుగా ఉన్న పలువురు ప్రతిభావంతులైన జడ్జీలు ఉన్నారని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. జస్టిస్ పంచోలికి పదోన్నతి కల్పించాలన్న నిర్ణయం జ్యుడీషియల్ నిర్వహణకు ప్రతికూలంగా ఉందని, ఇది సుప్రీంకోర్టు కొలీజియం విశ్వసనీయతను ప్రమాదంలో పడేస్తుందని అన్నారు. 4:1 మెజారిటీ-తో కొలీజియం ఆగస్ట్ 25న జస్టిస్ అరాధేతో పాటు- జస్టిస్ పంచోలిని సిఫారసు చేసింది. సుప్రీంకోర్టుకు వారి నియామకాన్ని 48 గంటల్లోనే, ఆగస్ట్ 27న ప్రకటించారు. జస్టిస్ పంచోలీ 1968, మే 28న అహ్మదాబాద్‌లో జన్మించారు. 2016 జూన్‌లో గుజరాత్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023 జులైలో ఆయన పాట్నా హైకోర్టుకు బదిలీ కాగా 2025 జులై 21న పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ అరాధే 1964లో జన్మించారు. 2009 డిసెంబర్‌లో మధ్యప్రదేశ్ అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2011 ఫిబ్రవరిలో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2016లో జమ్మూకాశ్మీర్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2018లో మే నుండి ఆగస్ట్ వరకు మూడు నెలల పాటు- దాని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. జస్టిస్ అరాధే కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2022 అక్టోబర్ వరకు దాని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2023 జులైలో తెలంగాణ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు అనంతరం 2025 జనవరి 21న బాంబే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల జాబితాలో జస్టిస్ అరాధే మూడవ స్థానంలో ఉన్నారు. జస్టిస్ పంచోలి 19వ స్థానంలో ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి

## ఆర్థిక పరిస్థితిపై తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం

వాస్తవానికి, గత నాలుగు నెలల్లో సగటు- నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు- మాత్రమేనని (4 నెలల్లో రూ.9,355 కోట్లు-) పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణభారాన్ని ఎక్కువ చేసి చూపిస్తుందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రజల జీవనం స్తంభించిపోయిందని కెటిఆర్ అన్నారు. ఈ వర్షాల వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తినష్టం జరిగిందని, ప్రజలు సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, విలాసవంతమైన, లాభదాయకమైన ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. రూ.3,50,000 కోట్ల 2036 ఒలింపిక్స్ నిర్వహణ, రూ.1,50,000 కోట్ల మూసీ సుందరీకరణ, రూ. 225 కోట్ల హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టుల గురించి చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల గోడును గాలికొదిలేసి, డబ్బు సంపాదించే పనులపైనే రేవంత్ అండ్ కో దృష్టి పెట్టిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గు లేకుండా వ్యవహరిస్తుందని, ఇది ప్రజా పాలన కాదని ట్వీట్ చేశారు. కష్టాలను అధిగమించి మనకు స్ఫూర్తినిచ్చిన అద్భుతమైన క్రీడాకారులను మనం గౌరవించుకోవాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ జయంతిని గుర్తు చేసుకుంటూ కెటిఆర్ టీ-÷-వట్ చేశారు. ఆటలు మనకు సహకారం, పోరాట స్ఫూర్తిని నేర్పిస్తాయని అన్నారు. 'మనం కిందపడితే అది ముఖ్యం కాదు, మళ్లీ ఎలా పైకి లేచామన్నదే ముఖ్యం' అని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## నేటినుంచి అసెంబ్లీ సమావేశాలు స్వతంత్ర ఎమ్మెల్యేగా హాజరవుతున్నా: రాజాసింగ్

ఒకప్పుడు అసెంబ్లీలో ఏం మాట్లాడాలన్నా పార్టీ అగ్రనాయకత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉండేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే సమయం వరకు సభలో మాట్లాడే అవకాశాన్ని పార్టీ ఇచ్చేది కాదని పేర్కొన్నారు. కానీ సభలో తనకు మాట్లాడే అవకాశం ఇస్తే వివిధ అంశాలు లేవనెత్తుతానన్నారు. తనలాగే బీజేపీలో చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. దీనికి తాజా ఉదాహరణ చేవెళ్ల ఎంపీ వ్యవహారమేనని తెలిపారు. వారిలాగే చాలా మంది పదవులు పోతాయని పార్టీలో జరుగుతున్న ఇబ్బందులపై నోరు విప్పడం లేదన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నా.. వాటిని కొంతమంది సర్వనాశనం చేశారంటూ బీజేపీలోని పలువురు నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇప్పటివరకూ ఢిల్లీలోని బీజేపీ నేతల నుంచి తనకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. ఒకవేళ వస్తే ఇక్కడ నెలకున్న ఇబ్బందులను వారికి వివరించిన తర్వాతే మళ్లీ ఆ పార్టీలోకి వెళ్తానని స్పష్టం చేశారు. లేకుంటే చచ్చినా.. మళ్లీ ఆ పార్టీలోకి వెళ్లనని ఆయన కరాకండిగా చెప్పారు. ఇక పార్టీలోని పలువురు ఎంపీలు తమ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక్క ఎమ్మెల్యేను సైతం గెలిపించలేకపోయారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, బీసీ బిల్లులపై అసెంబ్లీ సమావేశాలు అనేది కేవలం ప్రజల నుంచి దృష్టి మరల్చడానికి మాత్రమేనని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల నుంచి ముస్లింలను తీసేయాలని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశాన్ని దమ్మంటే సీబీఐకి అప్పచాలంటూ రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సవాల్ విసిరారు.

మొదటిపేజీ తరువాయి

## హైదరాబాద్‌లో నిమజ్జన సందడి ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలు అమలు

ఈ ట్రాఫిక్ ఆంక్షలు సెప్టెంబర్ 5వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3:00 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని వెల్లడించారు. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ఎ÷-లాజా, పీవీఎన్ఆర్ మార్గ్ వద్ద వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు- చేశామన్నారు.ఈ నేపథ్యంలో సెయిలింగ్ క్లబ్ జంక్షన్, వీవీ విగ్రహం, తెలుగు తల్లి జంక్షన్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ ఎక్స్ రోడ్డు, నల్లగుట్ట బ్రిడ్జ్, బుద్ధ భవన్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తామని వివరించారు. అలాగే అప్పర్ ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు మార్గాల్లో అవసరాన్ని బట్టి ఆంక్షలు అమలు చేస్తామన్నారు. లిబర్టీ, ఖైరతాబాద్, సికింద్రాబాద్, పంజాగుట్ట వైపు వచ్చే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు కీలక సూచన చేశారు. అలాగే కవాడిగూడ, బేగంపేట్, మినిస్టర్ రోడ్, తెలుగు తల్లి÷-లపై ఓవర్ మీదుగా ట్రాఫిక్ మళ్లిస్తామని చెప్పారు. వినాయక చవితి సందర్భంగా పండగను దేశవ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ మేరకు హైదరాబాద్ నగరవ్యాప్తంగా ప్రతి గల్లీలో భారీగా వినాయకుని విగ్రహాలు ఏర్పాటు- చేశారు. ఈ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుంది. ఇవి సెప్టెంబర్ 5వ తేదీతో ముగియనున్నాయి. అందుకోసం ప్రభుత్వం ఏర్పాట్లు- చేసింది. ఇక ఈ నిమజ్జనం నేపథ్యంలో నగరంలో పోలీసులు భద్రతతోపాటు- నిఘాను పటిష్టం చేశారు. ఈ నిమజ్జనానికి తరలివచ్చే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు- చేశారు.

## వివేకా హత్యపై మళ్లీ సిబిఐ విచారణ జరగాలి

### పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్

అమరావతి,ఆగస్ట్29(సమయజ్యోతి ):

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుపై ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన కామెంట్స్ చేశారు. శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడిన ఆమె.. వివేకా హత్య విషయంలో మళ్లీ దర్యాప్తు ఎందుకు చేపట్టవద్దని ప్రశ్నించారు. వై నాట్? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఒకటే పోరాటం అని.. ఇంత వరకు న్యాయం జరుగలేదన్నారు. సునీత పోరాటంలో న్యాయం ఉందన్నారు. జగన్ మోదీకి దత్తపుత్రుడు అంటూ సంచలన కామెంట్స్ చేశారు. మోదీ చేతిలో సీబీఐ కీలు బొమ్మ అని.. జగన్ కోసం మోదీ సీబీఐ గొంతు నొక్కారని అన్నారు. జగన్ కోసం అవినాష్ రెడ్డిని కూడా కాపాడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. నిజంగా సీబీఐ అనుకుంటే ఎప్పుడో దోషులకు శిక్ష పడేదన్నారు. వివేకా హత్య కేసులో అన్ని ఆధారాలు ఉన్నాయని.. గూగుల్ మ్యాప్ లొకేషన్లు కూడా ఉన్నాయని షర్మిల పేర్కొన్నారు. వైఎస్ వివేకా హత్య జరిగినప్పుడు అవినాష్ రెడ్డి సంఘటనా స్థలంలో ఉన్నాడని.. ఇందుకు సంబంధించి సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయని షర్మిల తెలిపారు. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ.. న్యాయం ఎందుకు జరుగడం లేదని ప్రశ్నించారామె. సీబీఐ విచారణ సరిగా లేదంటూ సునీత చేసిన ఆరోపణల్లో నిజముందన్నారు.

## తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 29

గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ఇప్పటికే ప్రదర్శించామని తెలిపారు. ఈ జాబితాలపై అభ్యంతరాలను ఈ నెల 30వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. ఆ తరువాత సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ, వార్డు వారీగా ఫోటోలతో కూడిన తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా రాజకీయ పక్షాలు సహకరించాలని, ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా గడువులోగా సమర్పించాలని సూచించారు. అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితాలో సవరణలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ రెడ్డి, ఎంఐఎం నాయకుడు మజార్, బీఆర్ఎస్ నేత కోరిపెల్లి రాంకిషన్ రెడ్డి, రమేష్, టీడీపీ రమేష్, వైఎస్ఆర్‌సీపీ నరేష్, ఆమ్ ఆద్మీ పార్టీ హైదర్, తదితరులు పాల్గొన్నారు.



## బదిలీ అయిన తాసిల్దార్ కు సన్మానం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీధర్ ఆర్మూర్ బదిలీ పై వెళ్తున్న సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు శాలువా కప్పి సన్మానం చేసి ఆయన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## రామసేతుపై సుబ్రమణ్యస్వామి పిటిషన్

### విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు-కేంద్రానికి నోటీసులు జారీ

న్యూఢిల్లీ,ఆగస్ట్29(సమయజ్యోతి ):

'రామసేతు'ను జాతీయ వారసత్వ స్మారక చిహ్నంగా ప్రకటించాలని కోరుతూ గతంలో కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణ్యస్వామిదాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. దీనిపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. రామసేతుకు సకాలంలో జాతీయ స్మారక చిహ్నం హోదా కల్పించాలని, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాతో సర్వే చేయించాలని గతంలో సుబ్రమణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా విచారణ చేపట్టారు. సుబ్రమణ్య స్వామి తరఫున సీనియర్ న్యాయవాది విభా మఖిజా వాదనలు వినిపించారు. రామసేతును కాలుష్యం నుంచి కాపాడటంతో పాటు- దాని పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని సుబ్రమణ్యస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ప్రదేశం పలువురి నమ్మకాలతో ముడిపడి ఉందని తెలిపారు. మరోవైపు 'సేతు సముద్రం షిప్ ఛానెల్ ప్రాజెక్టు' కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంపిక చేసుకోవాలని, తద్వారా రామసేతుకు ఇబ్బంది కలగకుండా ఉంటు-ందని పేర్కొంటూ సుబ్రమణ్య స్వామి మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ప్రస్తుతం అది సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మన్నార్, పాక్ జలసంధిని కలుపుతూ 83 కి.మీ మేర పూడిక తీసి..ఛానెల్‌ను ఏర్పాటు- చేయాల్సి ఉంటు-ంది. ఇది కార్యరూపం దాల్చితే రామసేతుపై తీవ్ర ప్రభావం ఉంటు-ందన్న ఆరోపణలు ఉన్నాయి.రామసేతును జాతీయ వారసత్వ స్మారక చిహ్నంగా ప్రకటించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణ్య స్వామి సుప్రీంకోర్టులో గతంలోనే ఓ పిల్ దాఖలు చేశారు.

# గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో ఆదేశాల మేరకు 53 మందికి స్థానచలనం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు జరిగాయి. జిల్లాలోని ఎల్ 2, ఎల్ 1, ఎంఎస్ సీసీఎస్ 53 మంది ఉద్యోగులకు శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కౌన్సిలింగ్ నిర్వహించి, బదిలీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



# గ్రామానికి సమీపంలోనే గ్రామ పంచాయతీ భవనంను నిర్మించాలి.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల పరిధి ధర్మపురం గ్రామనికి నూతన గ్రామ పంచాయతీ భవనం మంజూరు అయింది. గ్రామపంచాయతీ భవనంకు కావలసిన స్థలాన్ని ధర్మపురం వాస్తవ్యులు శ్రీనివాస్ రెడ్డి దానంగా ఇచ్చేందుకు అంగీకరించారని అన్నారు. అట్టి స్థలం గ్రామ ప్రజలందరికీ అనవుగా, సౌకర్యంగా ఉంటుందని ఆ స్థలంలోనే గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మాణం చేయాలని కోరుతూ తహసిల్దార్ రవికుమార్ కు, ఎంపీడీఓ శ్రీనివాసులుకు వేరువేరుగా గ్రామస్తులు వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీనివాసులు, మోహన్ రెడ్డి, శివయ్య, టైలర్ కురుమన్న, సోమన్న, వెంకటన్న, రాములు, కుర్వ పెద్ద ఆశన్న, మైల లక్ష్మన్న, అలంపూర్ ఆంజనేయులు, అలంపూర్ మన్యం, వడ్డే వెంకటేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# మానేరులో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేక సెర్చింగ్ ఆపరేషన్ టీం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కనిపెట్టేందుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ప్రత్యేక సెర్చింగ్ ఆపరేషన్ టీంను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య బుధవారం గల్లంతు అయ్యారు. ఆయన ఆచూకీ కనిపెట్టేందుకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, నీటి పారుదల, మత్స్య శాఖ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎగువ మానేరు ప్రవహించే మండలాల్లోని చెక్ డ్యాంలు, బ్రిడ్జిలు, కల్వర్టులు ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని సూచించారు. నర్మాల నుంచి గంభీరావుపేట వరకు, గంభీరావుపేట నుంచి మల్లారెడ్డిపేట వరకు, మల్లారెడ్డిపేట నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు, వెంకటాపూర్ నుంచి సిరిసిల్ల వరకు, సిరిసిల్ల నుంచి మధ్య మానేరు రిజర్వాయర్ వరకు వెతకాలని ఒక్కో ప్రాంతానికి ఐదుగురితో కలిపి ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. ఈ టీమ్ సభ్యులు వెంటనే తమ విధి నిర్వహణను మొదలు పెట్టాలని ఆదేశించారు.



# సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ తుది ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురణ : కలెక్టర్ సందీప్ కుమార్ ఝు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ తుది ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝు అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్, గ్రామ పంచాయతీ ఓటర్ లిస్ట్, పోలింగ్ కేంద్రాల లిస్ట్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా అప్ డేట్ చేయడం జరుగుతుందని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 12 మండలాల పరిధిలో 260 గ్రామ పంచాయతీ లలోని 2268 వార్డులలో 3,52,134 ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ఆగస్టు 28న విడుదల చేసి గ్రామపంచాయతీ కార్యాలయాలలో అంటించడం జరిగిందని అన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ వారిగా డ్రాఫ్ట్ ఓటర్ జాబితా తయారు చేశామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఈ జాబితా పరిశీలించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 30 లోపు తెలియజేయాలని, ఆగస్టు 31 లోపు వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2న తుది ఓటర్ జాబితా ప్రచురించడం జరుగుతుందని అన్నారు. ప్రతి మండలం పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు 2268 డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా ఎంపీడీవో మఆగస్టు 28న తయారు చేశారని, వీటిపై అభ్యంతరాలను ఆగస్టు 30 లోపు ఎంపిడిఓ కార్యాలయంలో అందించాలని అన్నారు. సెప్టెంబర్ 2న తుది పోలింగ్ కేంద్రాల జాబితా తయారు చేయడం జరుగుతుందని అన్నారు. 600 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటు చేస్తున్నామని, జిల్లాలో ఎక్కడైనా అదనపు పోలింగ్ కేంద్రం అవసరమంటే వివరాలు అందిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డిపిఓ షరీపుద్దిన్, డిఎల్పిఓ నరేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 27.**



జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా (మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి) జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యన్.టి.ఆర్ మినీ స్టేడియంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం రాష్ట్ర స్థాయిలో జరిగిన సీయం కప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పథకాలు సాధించిన క్రీడాకారులను అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్‌చంద్ భారత క్రీడలకు చేసిన సేవలు అమోఘమని, ఆయన స్ఫూర్తితో ప్రతి క్రీడాకారుడు కృషి చేస్తే అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం సాధ్యమని అన్నారు. జిల్లాలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి క్రీడల శాఖ కృషి చేస్తుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రాంచందర్, ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మనాభ గౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ అన్నపూర్ణ గౌడ్, ట్రస్మా అధ్యక్షులు చంద్ర గౌడ్, పెటా సెక్రటరీ భోజన్న, పెటా అధ్యక్షుడు భూక్యా రమేష్ తదితరులు క్రీడల ప్రాధాన్యాన్ని వివరించారు. జిల్లా వ్యాప్తంగా పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# మిలాద్ ఉన్ నబీకి మసీదులు దర్గాలు అలంకరించాలి : సీఎంకు విజ్ఞప్తి చేసిన ఓవైసీ

**సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ తోపాటు మార్కజ్ మిలాద్ జులూస్ కమిటీ సభ్యులు కలిశారు. ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పురాతన మసీదులు, దర్గాలను అలంకరించాలని, వాటికి ఉచిత విద్యుత్ సరఫరా అందించాలని ఈ సందర్భంగా వారూ విజ్ఞప్తి చేశారు. అలాగే సెప్టెంబర్ 14న రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరారు.




# మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో లో మెడికల్ క్యాంపు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్**

మామిడిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాల ను విజిట్ చేసి 21 మంది పిల్లలకు దగ్గు, సర్ది, జలుబు, అలర్జీ ఉన్న పిల్లలకు మందుగోళీలు ఇవ్వడమైనది, విద్యార్థులకు వ్యక్తి గత పరిశుభ్రత గోర్లు ప్రతివారం కత్తిరించు కోవాలని, పక్క బట్టలు శుభ్రంగా ఉతికి అరబెట్టు కోవాలని, పరిసరాలపరిశుభ్రత గూర్చి తెలియజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమం లో హెల్త్ సూపర్ వైజార్ బి. సుభాష్, హెల్త్ అసిస్టెంట్స్ ఇందుబాయి, పవర్ ప్రేమసింగ్ ఆశ్రమ స్కూల్ హెడ్ మాస్టర్ శైలజ , ఏ ఎన్ ఎం కామేశ్వేరి, ఆశా రుక్మిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు





# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బోట్ల లింబాద్రి ఇంట్లోకి శుక్రవారం వర్షపునీరు వెళ్లి ఆర్థిక నష్టం జరిగింది. అ కుటుంబానికి స్థానిక మాజీ సర్పంచ్ భూస సునీత నరహరి 5000/- ఆర్థిక సహాయం చేసారు. స్థానిక శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి సహాయం అందించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# రైతులకు దెబ్బమీద దెబ్బ !

ఇప్పటికే యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడ్డ రైతులపై దెబ్బమీద దెబ్బ అన్నట్లుగా అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీసాయి. పలు జిల్లాల్లో విపరీతమైన భారీ వర్షాలతో పంటలన్నీ నీటమునిగాయి. వేసిన పంటలన్నీ నీటి పాలయ్యాయి. పెట్టుబడులు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయాయి. అనేక జిల్లాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఉత్తరాది రాష్ట్రాల్లోనూ ఇలాగే ఉంది. వరదలు వచ్చిన ప్రతిసారీ పంటనష్టం సకాలంలో అందడం లేదు. ప్రభుత్వం నష్టం అంచనా వేసి ఇచ్చే అరకొర పరిహారం కూడా ఎప్పుడు అందుతుందో తెలియదు. ఇకపోతే యూరియా సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. దీనిని బట్టి రైతులు ఎంతగా ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసు కోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత మాత్రాన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టడం తగదు. బిజెపి నేతలు కూడా స్థానిక సమస్యపై చర్చించకుండా ఇక్కడి ప్రభుత్వంపైనే నిందలు వేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం పలుమార్లు విన్నవించినా పెద్దగా స్పందించలేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కేటాయించిన ఎరువులు కోటాను పరిశీలిస్తే తెలంగాణపై కొంత పక్షపాతం చూపిస్తున్నట్టుగానే కనిపిస్తోంది. ఈ సంవత్సరం పంటల సేద్యం పెరగవచ్చుననే దృష్టితో రాష్ట్రం 20 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కోరితే, రాష్ట్రానికేంద్రం కేటాయించింది 9.80 లక్షల టన్నులు మాత్రమే. ఆగస్టు ఆఖరినాటికి 8.30 లక్షల టన్నులు సరఫరా చేయాల్సిఉండగా ఈనెల ఆఖరికి వచ్చింది 5.66 లక్షల టన్నులు మాత్రమే. ఆ వివరాలు వ్యవసాయశాఖ మంత్రి పత్రికా ముఖంగా వివరించారు. ఇంకా సుమారు 3 లక్షల టన్నుల లోటు ఉండటం.. సకాలంలో కేంద్రం సరఫరా చేయకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఎప్పటికప్పుడు వస్తున్న ఎరువులను మానిటరింగ్ చేస్తూ యూరియాను డిమాండ్ ఉన్న ప్రాంతానికి పంపిస్తున్నామని, రైతులు ఎరువులు దొరకవని ఆందోళన చెందనవసరం లేదని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నాయ కులు.. పాలకుల వైఫల్యమే అంటూ, ఎరువులు సరఫరా చేయలేని చేతకాని ప్రభుత్వాలంటూ విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. విమర్శలు, మాటలు పక్కకుపెట్టి యుద్ధప్రాతిపదికన ఎరువులు సరఫరా జరిగేలా చూడమని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలు పరిశీలించకుండా రాష్ట్రంలో ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారు. రైతులు రాత్రింబవళ్లు సహకార బ్యాంకు గోదాముల వద్ద క్యూలైన్లో ఉంటూ.. పట్టా పాస్ బుక్కులు, చివరికి చెప్పులు కూడా క్యూలైన్లు లో పెడుతూ, లైన్ లో ఘర్షణలు పడుతూ, కొన్నిచోట్ల లాఠీచార్జీలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఎందుకు ఈ పరిస్థితి వచ్చింది? దీనికి బాధ్యులు ఎవరన్నది ఆలోచించాలి. రాష్ట్రాలకు యూరియా కేటాయింపులు, సరఫరా పూర్తిగా కేంద్ర ఎరువులు, రసా యనాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటాయి. రాష్ట్రం గత ఏడాది వేసిన పంటలను దృష్టిలో పెట్టుకుని 10 శాతం విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఖరీఫ్ సీజన్ రాకముందే ప్రణాళిక రూపొందించి, 20 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు కావాలని కేంద్రాన్ని కోరింది. గతంలో ఇచ్చిన 2 లక్షల టన్నులు ఇప్పటికే రాష్ట్రం వద్ద నిల్వలు ఉన్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఎప్పటికప్పుడు పంపుతున్నామని.. రూ. 80,000 కోట్లు సబ్సిడీ భరించా మని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. యూరియాపై ప్రభుత్వం భరి స్తున్న సబ్సిడీ ఎక్కువగా ఉంది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. చైనా నుంచే 20 శాతం దిగుమతి చేసుకోవాలి. సబ్సిడీని తగ్గించుకొనే ఎత్తులో భాగంగా తక్కువలో తెప్పించుకొనే ప్రయత్నం చేస్తుం దని కేంద్రంపై విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా అన్నదాతలకు అగచాట్లు- తప్పట్లేదు. ప్రస్తుతం వేసిన పంటలకు 15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వాన్ని కోరుతోంది. దాంతో డిమాండు ఎక్కువగా ఉండి.. సరఫరా తక్కువగా ఉండటంతో.. పంపిణీ కేంద్రాల దగ్గర వేకువ జాము నుంచే పడిగాపులు కాస్తున్నప్పటికీ సరుకు కొంతమందికే అందటంతో ఆందోళన మొదలయ్యింది. డిమాండును అడ్డుపెట్టుకొని పలుచోట్ల నల్ల బజారు విక్రయాలు యధేచ్ఛగా రూ.266 బస్తాను రూ. 400 వరకు అమ్ముతున్నారని విమర్శలు వస్తున్నాయి. పారిశ్రామిక అవసరాల కోసం వ్యవసాయ యూరియాను దారి మళ్ళిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అతిగా రసాయన ఎరువుల వినియోగం, పంట మార్పిడి విధానం లేనందున నేలలో మంచి బ్యాక్టీరియా నశిస్తుంది. అతిగా నీరు పెట్టడం, ఎరువులు, రసాయనాలు వాడటం వల్ల భూసారం క్షీణిస్తుంది. రసాయన ఎరువులు, గుమ్మరిస్తే ఫల సాయం రెట్టింపు కాదు. దీనిపై రైతాంగంలో అవగాహన పెంచడంలో ప్రభుత్వాల వైఫల్యం.. మన ఆహార భద్రతనే ప్రమాదంలోనికి నడుతుంది. సాగు భూములను కాపాడుకోవాలంటే ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహిస్తూ, తగినంత పరిణామం లోనే ఎరువులు చల్లేలా అన్నదాతను చైతన్య పరచాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి హెచ్చరించింది. అయితే మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క రైతు అనుకూల నిర్ణయం తీసుకోలేదు. అప్పుడప్పుడూ మద్దతు ధరలు పెంచడం తప్ప చేసిందేమీ లేదు. రైతుల సంఘాల నుంచి వ్యతిరేకతలు, ఆందోళనలు వస్తున్నా చర్చించడం లేదు. సాగుచట్టాలు తీసుకుని వచ్చాక అవి ఎందుకు మంచివో చెప్పలేక పోయింది. వాటిని రద్దుచేస్తున్న సమయంలోనూ ఎందుకు రద్దు చేస్తుందో చెప్పలేదు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా జాతీయ సాగు విధానం తీసుకుని రావవడం లోనూ.. దేశీయంగా పంటలను ప్రోత్సహించడంలోనూ విఫలమయ్యింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోడీ పండించిన పంటలను కొనుగోలు చేసే దిక్కు లేకుండా చేసింది. దేశీయంగా పంటలు పండుతున్నా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో రైతులు పోరుబాట పడుతున్నారు.

# వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి

గిడుగు వెంకట రామ మూర్తి 29 ఆగస్టు 1863,22 జనవరి 1940 తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు,భాషా శాస్త్రవేత్త,బహుభాషా ప్రవీణుడు, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతు వాది. గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి,నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు. వ్యవహారికభాషను గ్రంథరచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చతెలుగు చిచ్చర పిడుగు గిడుగు.గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్యసృష్టి, సృజనాత్మక శక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. గిడుగు రామ్మూర్తి గారి జయంతి ఆగష్టు 29 ని "తెలుగు భాషా దినోత్సవం" గా జరుపుకుంటున్నాము.

## తొలి జీవితం

గిడుగు వెంకట రామమూర్తి 1863 ఆగష్టు 29 వ తేదీ శ్రీకాకుళానికి ఉత్తరాన ఇరవైమైళ్ళ దూరంలో ముఖలింగ క్షేత్రం దగ్గర ఉన్న పర్వతాలపేట అనే గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి వీర్రాజు,తల్లి వెంకమ్మ. వీర్రాజు పర్వతాలపేట ఠాణాలో సముద్దారు (రివెన్యూ అధికారి)గా పనిచేస్తుండేవారు. 1875 దాకా ప్రాథమిక విద్య ఆ ఊళ్ళోనే సాగింది. తండ్రి చోడవరం బదిలీ అయ్యి అక్కడే విష జ్వరంతో 1875 లోనే చనిపోయారు. విజయ నగరంలో మేనమామ గారి ఇంట్లో ఉంటూ రామమూర్తి మహారాజావారి ఇంగ్లీషు పాఠశాలలో ప్రవేశించి 1875 మొదలు 1880 వరకు విజయనగరంలో గడిపారు. 1879లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణు లయ్యారు.ఆ రోజుల్లో గురజాడ అప్పారావు రామమూర్తికి సహాధ్యాయి. ఆ ఏడే రామమూర్తికి పెండ్లి అయింది.1880లో ముప్పై రూపాయల జీతం మీద పర్లాకిమిడి రాజావారి స్కూల్లో ఫస్టుఫారంలో చరిత్ర బోధించే అధ్యాపకులైనారు. సంసారబాధ్యత (తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు) రామమూర్తి పై బడింది. ప్రైవేటుగా చదివి 1886 లో ఎఫ్.ఏ.,1894లో బి.ఏ.మొదటి రెండు భాగాలు (చరిత్ర తప్ప) ప్యాసయ్యారు. 1896లో మూడోభాగం ప్యాసై పట్టం పుచ్చుకున్నారు. ఇంగ్లీషు,సంస్కృతాలు గాక, ప్రధాన పాఠ్యాంశంగా చరిత్ర తీసుకుని రాష్ట్రం లో మొదటి తరగతిలో,రెండోర్యాంకులో ఉత్తీర్ణులయ్యారు.రాజావారి ఉన్నత పాఠశాల కళాశాల అయింది.అప్పుడు అతనికి కళాశాల తరగతులకు పాఠాలు చెప్పే యోగ్యత వచ్చింది.

## సవర భాష పాండిత్యం

ఆరోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగింది. తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నారు.ఈ పరిశ్రమ చాలా ఏళ్ళు జరిగింది. సవరభాషలో పుస్తకాలు వ్రాసి సొంత డబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913 లో "రావు బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్పై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవరభాషా వ్యాక రణాన్ని, 1936లో సవర-ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931 లోను, సవర-ఇంగ్లీషు కోశాన్ని 1938 లోను అచ్చువేశారు.1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్-ఇ-హింద్ ' అనే స్వర్ణ పతకాన్ని ఇచ్చి గౌరవించింది.

"సవర" దక్షిణ ముండా భాష. మన దేశంలో మొట్టమొదట ముండా ఉపకుటుంబ భాషను శాస్త్రీయంగా పరిశీలించినవాడు గిడుగు రామమూర్తి.ఆస్ట్రో-ఏషియాటిక్ భాషా కుటుంబంలో ఒక శాఖ ముండాభాషలు. ఆర్యభాషా వ్యవహర్తలు మన దేశానికి రాక ముందు (క్రీ.పూ. 15వ శతాబ్ది) నుంచి వీళ్ళు మనదేశంలో స్థిరపడ్డారు.వీరిని "శబరు" లనే ఆదిమజాతిగా ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 7వ శతాబ్ది) లో పేర్కొన్నారు.

## శాసనాల అధ్యయనం

హైస్కూల్లో చరిత్రపాఠం చెప్పేరోజుల్లోనే దగ్గరలో ఉన్న ముఖలింగ దేవాలయాల్లో ఉన్న శాసనాల లిపిని స్వతంత్రంగా నేర్చుకుని చదివారు. విషయపరిశోధన చేసి వాటి ఆధారంగా ఎన్నో చారిత్రకాంశాలు, ముఖ్యంగా గాంగ వంశీయుల గురించి రామమూర్తి ఇంగ్లీషులో ప్రామాణికవ్యాసాలు వ్రాసి ఇండి యన్ ఆంటిక్వారీ లోనూ, మద్రాస్ లిటరేచర్ అండ్ సైన్స్ సొసైటీ జనరల్స్ లోనూ ప్రచురించారు.1911లో గిడుగు 30 ఏళ్ళ సర్వీసు పూర్తికాగానే అధ్యాపకపదవి నుంచి స్వచ్ఛందంగా రిటైరయ్యారు.అంతకు కొద్ది సంవత్సరాల ముందే ఆధునికాంధ్ర భాషా సంస్కరణ వైపు అతని దృష్టి మళ్ళింది.

## వ్యక్తిత్వం

రామమూర్తికి చిన్నప్పటినుంచి విద్యాసక్తి, కార్యదీక్ష, సత్యాన్వేషణ ప్రధాన లక్షణాలు. సవరలు, హరిజనులు అంటరాని జనాలని అప్పటి సంఘం అంటుండే ఆ కాలంలోనే, అతను సవర విద్యార్థులకు తన ఇంట్లోనే బస ఏర్పరచి, భోజనం పెట్టేవారు.1930 లలో ఒడిషా ఏర్పడనున్నప్పుడు, పర్లాకిమిడి రాజా తన పర్లాకిమిడి తాలూకా అంతటిని ఒడిషా రాష్ట్రంలో చేర్పించడానికి ప్రయత్నించినపుడు, తెలుగువారికి నాయకునిగా రామమూర్తి నిలిచి ప్రతిఘటించారు. ఆ తాలూకాలో చాలా భాగాన్ని, పర్లాకిమిడి పట్టణాన్ని ప్రభుత్వం అక్రమంగా ఒడిషాలో చేర్చడంవల్ల, తెలుగువారికి అన్యాయం జరిగిందని తెలియజేస్తూ అతడు 1936లో ఒడిషా రాష్ట్ర ప్రారంభోత్సవం జరిగే దినం ఉదయమే పర్లాకిమిడిలో ఉండడానికి ఇష్టపడక,వెంటనే రాజమహేంద్రవరం వచ్చి అక్కడే తన శేషజీవితాన్ని గడిపారు.ఆయన పట్టుదలకు ఇది ఒక గొప్ప నిదర్శనం. గిడుగుకు తెలుగు భాషకు మేలు జరగాలన్నదే తప్ప వ్యక్తిగతంగా తనకు పేరు రావాలన్న ఆలోచన, పట్టింపు ఉండేవి కాదు.ఒక వ్యాకరణంలో గిడుగును ప్రస్తావించకుండా అతని రచనలోని భాగాలు వాడుకున్నారని భావరాజు వెంకట కృష్ణారావు బాధపడితే "అక్షరాలు కనిపెట్టినవాడి పేరెవరికైనా తెలుసునా? అట్లాగే నా పేరు తెలిస్తే నేం, తెలియక పోతేనేం?" అని గిడుగు రామ్మూర్తి ఓదారుస్తూ జవాబిచ్చారు.

## వచనభాష సంస్కరణోద్యమం

1907లో జె.ఏ.యేట్స్ అనే ఇంగ్లీషుదొర ఉత్తర కోస్తా జిల్లాలకు స్కూళ్ళ ఇన్స్పెక్టర్గా వచ్చారు.చిన్న తరగతుల్లో తెలుగు పండితులు పాఠాలు చెప్పే పద్ధతి ఆ దొరకు అర్థం కాలేదు.ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఎందుకు తేడాలు ఉన్నాయి అన్నది అతని ముఖ్య సమస్య.అంతకు ముందు తమిళదేశంలోనూ అదే సమస్య అతనిని వేధించింది. విశాఖపట్నంలో ఏ.వి.ఎన్. కళాశాల ప్రిన్సిపాలుగా ఉన్న పి.టి. శ్రీనివాస అయ్యంగారిని అడిగితే ఆయన గురజాడ, గిడుగులు దీనికి సమాధానం చెబుతారని అన్నారు.ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్థంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యావిధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించారు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. అప్పటికే ఇంగ్లీషులో భాషాశాస్త్ర గ్రంథాలు చదివిన గిడుగు ప్రతి యేడూ జరిగే అధ్యాపక సదస్సుల్లో జీవద్భాష ప్రాధాన్యత గురించి ఉపన్యాసాలు ఇచ్చారు.1906 నుండి 1940 వరకు గిడుగు రామమూర్తి కృషి అంతా తెలుగు భాషా సేవకే. యేట్స్ ప్రోత్సాహంతో శిష్టజన వ్యావహారిక తెలుగు భాషను గ్రంథరచనకు గ్రాహ్యమైందిగా చేయడానికి అత్యంత కృషి చేసి కృతకృత్యులయ్యారు. వీరేశలింగం పంతులు ఊతం కూడా ఇతనికి లభించింది. 1919,20 ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపారు. వ్యావహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభ 1925 తణుకులో నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింప జేసారు "గిడుగు". సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బల పరచాయి. స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంథిక భాషే పాతుకు పోయింది.కొన్నిటిలో వీరేశ లింగం ప్రతిపాదించిన సరళ గ్రాంథికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యా సాలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దుష్టంగా వ్రాయలేడని నిరూపించారు. 1919లో గిడుగు "తెలుగు" అనే మాస పత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసా లతో, ఉప న్యాస పాఠాలతో అవిశ్రాం తంగా పోరాటం సాగించారు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావఝుల శివశంకరశాస్త్రి, వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వజల చినసీతారామస్వామి శాస్త్రి మొదలైన కవులు,పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు.1919 ఫిబ్రవరి 28 న రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షుడుగా,గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు.1933 లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్రవరంలో బ్రహ్మాం డంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధక వ్యాసాలతో "వ్యాస సంగ్రహం" అనే ఉద్గ్రం థాన్ని ఆయనకు సమర్పించారు.1924 లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఆధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది.1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్టవ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకుడుగా "జన వాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు,సంపాదకీయాలు వ్రాయటం మొదలుపెట్టింది.గిడుగు రామమూర్తి 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యా లయంలో పత్రికాసంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుదివిన్నపంలో వ్యావహారిక భాషా వ్యాప్తికి చాలా సంతృప్తి పొందారు. కాని, ప్రభుత్వ విద్యాశాఖవారు, విశ్వ విద్యాల యాలు గ్రాంథికాన్ని వదిలిపెట్టక పోవటానికి బాధపడ్డారు.ఆ విన్నపంలోని చివరి మాటలు. దేశభాష ద్వారా విద్య బోధిస్తేకాని ప్రయోజనం లేదు. శిష్టజన వ్యావహారిక భాష లోకంలో సదా వినబడుతూం టుంది. అది జీవంతో కళకళలాడుతూ ఉంటు ంది. గ్రాంథికభాష గ్రంథాలలో కనబ డేదే కాని వినబడేది కాదు.ప్రతిమ వంటిది. ప్రసంగాలలో గ్రాంథికభాష ప్రయో గిస్తూ తిట్టుకొన్నా, సరసాలాడుకున్నా ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో చూడండి. గ్రాంథికభాష యెడల నాకు ఆదరము లేకపోలేదు. ప్రాచీనకావ్యాలు చదువ వద్దనీ విద్యార్థులకు నేర్పవద్దనీ నేననను. కాని ఆ భాషలో నేడు రచన సాగించ డానికి పూనుకోవడం వృథా అంటున్నాను. నిర్దుష్టంగా ఎవరున్ను వ్రాయలేరు.రాసినా రాసేవారికి కష్టమే వినేవారికి కష్టమే. వ్రాసేవాండ్లేమి చేస్తున్నారు? భావం తమ సొంత (వాడుక) భాషలో రచించుకొని గ్రాంథికీకరణం చేస్తున్నారు.అది చదివేవాండ్లు, వినేవాండ్లు తమ సొంత వాడుకమాటలలోకి మార్చుకొని అర్థం చేసుకొంటున్నారు.ఎందుకీ వృథా ప్రయాస? స్వరాజ్యం కావలె నంటు న్నాము. ప్రత్యేకాంధ్రరాష్ట్రము కోసం చిక్కు పడుతున్నాము. ప్రజాస్వామిక పరి పాలనం కోరుచున్నాము.ఇటువంటి పరిస్థి తులలో మన ప్రజలకు, సామాన్య జనులకు ఏభాష ద్వారా జ్ఞానం కలుగ చేయవలసి ఉంటుం దో, ఏ భాషలో గ్రంథరచన సాగించ వలసి ఉంటుందో ఆలోచించండి. మీచే తులలో పత్రికలున్నవి.పత్రికల ద్వారా మీరు ఎంతైనా చేయగలరు".



## సాహితీ సేవలు

## 'కళింగ (ఒరిస్సా) చరిత్ర'

'సవర' ప్రజల (ముండా తెగ) కోసం భాషా లిపిని అభివృద్ధి చేసి,నిఘంటువులను సిద్ధం చేశారు.సోరా,ఇంగ్లీష్ నిఘంటువు

## సవర పాటలు

## ప్రశంసలు, పురస్కారాలు

1913 లో ప్రభుత్వం రావు సాహెబ్ బిరుదు ఇచ్చింది.

అతని సేవలకు గాను బ్రిటీష్ ప్రభుత్వం 1933 సంవత్సరంలో అతనికి "కైసర్-ఇ-హింద్ మెడల్" బిరుదును ప్రదానం చేసింది.

1938లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు కళాప్రపూర్ణతో గౌరవించింది.

పంతులుగారి పుట్టిన రోజును 'తెలుగు భాషా దినోత్సవము'గా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్నది.




# తాసిల్దార్ కు మండల కాంగ్రెస్ సన్మానం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో శుక్రవారం నూతన తహసిల్దార్ గా ఆర్ శ్రీనివాసు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో శివానికి రజిత పథకం



సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

హైదరాబాద్ లోని మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బాల్కొండ మండల కేంద్రంలోని కిసాన్ నగర్ సెయింట్ ఎలిజబత్ పాఠశాల పదవ తరగతి విద్యార్థిని శివాని రాణించి, రజిత పథకాన్ని సాధించారని శుక్రవారం పాఠశాల సిస్టర్ సుందరి ఒక ప్రకటనలో తెలిపారు. కరస్పాండెంట్ సిస్టర్ మేరీ, ఇంచార్జ్ సిస్టర్ సురేఖ, వ్యాయామ ఉపాధ్యాయులు ఏ శ్రీకాంత్, కవిత విద్యార్థినిని అభినందించారు.

# 30న కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను విజయవంతం చేయాలి

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ఈనెల 30న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ఉదయం 11గంటలకు సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ మాజీ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను విజయవంతం చేయాలని శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ మాజీ కార్యదర్శి గుంటి వేణు ఒక ప్రకటనలో తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి అంటే ఒక విప్లవం నిరంతరం తను ప్రజల మధ్యలో జీవిస్తూ ప్రజల కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు చేసిన చరిత్ర సురవరం సుధాకర్ రెడ్డికి ఉంది ఎంతోమంది అనేక విద్యార్థులలో ప్రజలలో చైతన్యవంతం చేస్తూ అనంతరం ఈ దోపిడీ వ్యవస్థను కూల్చడానికి తన జీవిత కాలమంతా పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పోరాటం చేసిన కామ్రేడ్ సురవరం తన చేసిన పోరాటాలు త్యాగాలు స్మరించుకుందాం. ప్రజలు విద్యార్థులు మేధావులు అనేక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

ఇందిరమ్మ ఇండ్ల మంజురు లో నిబంధనలు సవరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. అజయ్ డిమాండ్ చేశారు. అమరచింతలో శుక్రవారం నాడు జి.ఎస్. భవనంలో అయన మాట్లాడుతూ లక్షల రుపాయలు అప్పులు చేసి బేస్ మెంట్ నిర్మాణం చేసుకున్న వారికి శిథిలావస్థలో ఉంటున్న ఇంటిలో నివసిస్తున్న వారందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2025 జనవరి 26 నుంచి భూములు లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12,000 నగదులో భాగంగా కేవలం 6000 రూపాయలు ఇచ్చి మిగిలిన 6000 రూపాయలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. పట్టణ మున్సిపల్ కేంద్రాల్లోనూ భూములు లేని పేదలను గుర్తించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ను అమలు చేయాలని కోరారు. ఈ పథకానికి 5లక్షల కుటుంబా లకు ఏడాదికి 1200 కోట్ల రూపాయలు కేటాయించి కేవలం 50కోట్లు మాత్రమే జమ చేశారని అన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కొరకు ఒక్క కుటుంబానికి 50వేల రూపాయలను కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల పెన్షన్లను రెట్టింపు చేస్తామన్న ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని అన్నారు. 2500 ప్రతి నెల మహిళల అకౌంట్ లో జమ చేస్తానన్న హామీని అమలు నోచుకోలేదని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటిని అమలు చేయాలని లేనియెడల తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షులు పి. శంకర్, కేవీపీస్. జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఇ. శ్యామ్ సుందర్, ఆర్. ఎన్. నాగరాజు సుధాకర్, షేక్ పాషా, తిరుమలశ్రీను తదితరులు పాల్గొన్నారు.



# బాల్కొండ తాసిల్దారుగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ నూతన తహసీల్దార్ గా ఆర్ శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ చేపట్టారు. ఆయన, దీనికి ముందుగా జగిత్యాల కలెక్టరేట్ సూపరింటెండెంట్ గా పనిచేశారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు: కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి

## జల దిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాల సందర్శన

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, ఆగస్టు 29 :



ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరద తాకిడికి గురైన ప్రాంతాలలో సహాయక చర్యలను ముమ్మరం చేశామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ కారణంగా జల దిగ్బంధంలో చిక్కుకున్న కొప్పర్గ - హంగర్గ, సాలూర %-% ఖాజాపూర్ గ్రామాలను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. వరద తీవ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంపునకు గురైన గ్రామాల ప్రజలను బోట్ లు, ట్రాక్టర్లు, జేసీబీల సహాయంతో పునరావాస శిబిరాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న తీరును పరిశీలించిన కలెక్టర్, ఎక్కడ కూడా ప్రాణనష్టం వంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస శిబిరాలలో ఆశ్రయం ఉంటున్న వారికి భోజనం, మంచినీరు వంటి సదుపాయాలు కల్పించాలని, ముంపు గ్రామాలలో ఎవరు కూడా చిక్కుబడిపోకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది అందరూ వరద బాధితులకు సహాయంగా నిలుస్తూ, వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలని, ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ వారి వెంటే ఉందన్న భరోసాను కల్పించాలని హితవు పలికారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురైన వరి, సోయా, పత్తి, కంది తదితర పంటలను కలెక్టర్ పరిశీలించారు. వరద నీటి ఉధృతి తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే జరిపించి పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతామని బాధిత రైతులకు తెలిపారు. ప్రస్తుతం ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటూ, వరద బాధితులకు సహాయక చర్యలు కొన సాగించడంపై దృష్టిని కేంద్రీకరించామని అన్నారు. శ్రీరాంసాగర్ కు వరద పోటెత్తడం వల్ల బ్యాక్ వాటర్ కారణంగా ఆయా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని శ్రీరాంసాగర్ రిజర్వాయర్ ద్వారా 5 లక్షల క్యూసెక్కుల పైచిలుకు వరద జలాలను ఫ్లడ్ గేట్ల ద్వారా దిగువ గోదావరిలోకి వదులుతున్నామని తెలిపారు. దీనివల్ల ముంపు గ్రామాల్లో బ్యాక్ వాటర్ తగ్గి, శుక్రవారం సాయంత్రం నాటికి జలదిగ్బంధం నుండి బయటకు వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఎస్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు, 7వ బెటాలియన్ పోలీసు బృందాలు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయని, వరద తగ్గిన వెంటనే దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు తదితర వాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సదు పాయాలు పునరుద్ధరిస్తామని అన్నారు. భారీ వర్షాలతో వరద ఉధృతి కొనసాగు తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ రామారావు తదితరులు ఉన్నారు.

# భారీ వర్షాల కారణంగా ప్రజలకు సహాయక చర్యలు : కలెక్టర్ అభిలాష అభినవ్

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 29



జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.శుక్రవారం ఆమె ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్‌తో కలిసి బైంసా పట్టణంలోని రావుల్‌నగర్, ఆటోనగర్ ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో అధికంగా రావడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలడం జరుగుతుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఏవైనా ఇబ్బందులు తలెత్తితే 91005 77132 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన కలెక్టర్, వరదల కారణంగా ఎవరూ ప్రవాహం నీటిలోకి వెళ్లకూడదని హెచ్చరించారు. ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

అనంతరం భైంసా మండలంలోని దేగామ వంతెనను కలెక్టర్, ప్రత్యేక అధికారి పరిశీలించారు. వంతెన పరిసర ప్రాంతాలలో వరద పరిస్థితులను గమనించారు. స్థానికులతో మాట్లాడుతూ వరద నీటిప్రమాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అదే విధంగా కుంటాల మండలంలోని అందకూరు బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరదల వల్ల వంతెనలు, రహదారులు సర్వే చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

# సాజిత్ మెరాజ్ కు పీహెచ్డీ ప్రధానం

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 29.



నిర్మల్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు డాక్టర్ సాజిద్ మెరాజ్ కు ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయశాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. తను సమర్పించిన ఇండియన్ కాన్స్టిట్యూషనల్ డెవలప్మెంట్ త్రూ జ్యుడిషియల్ ఇంటర్ప్రిటేషన్ - ఏ క్రిటికల్ స్టడీ అనే పరిశోధనా ప్రబంధంను పరిశీలించి విశ్వవిద్యాలయ 84 వార్షికోత్సవంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మల్లురాం చేతుల మీదుగా ఆయనకు పీ.హెచ్.డి పట్టా బహుకరించారు. న్యాయ శాస్త్రంలోని అనేక అంశాలపై పరిశోధనాత్మక వ్యాసాలు సైతం రాశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో న్యాయ శాస్త్రంలో పీహెచ్డీ పట్టా పొందిన తొలి ముస్లింగా సాజిద్ మెరాజ్ నిలిచారు. అలాగే నిర్మల్ జిల్లాలో న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్న మొదటి వ్యక్తి డాక్టర్ సాజిద్ మెరాజ్ కావడం విశేషం. ఆయన అల్ - మిరాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు. ఉర్దూ జర్నలిస్టు సంఘం టియుడబ్ల్యూజెయు చీఫ్ ప్యాట్రన్ గా ఉన్నారు.ఆయన ఇదివరకే కాన్స్టిట్యూషనల్ స్టేటస్ అండ్ రైట్ ఆఫ్ మైనారిటీస్ అనే పుస్తకాన్ని ఇంగ్లీష్ లో వ్రాసారు. ప్రసిద్ధ కెరీర్ కాలమిస్టుగా, ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ కెరీర్ కోచ్ గా, సీనియర్ జర్నలిస్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, సామాజిక సాంస్కృతిక ప్రముఖులు, స్నేహితులు, ఉస్మానియా విశ్వవిద్యాలయ సిబ్బంది ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు రోడ్డులు బ్రిడ్జిలను పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సమయజ్యోతి న్యూస్ ఆగస్టు 29 బజార్ హత్నూర్ బోథ్

బోథ్ మండలంలోని దన్నూర్ బీ గ్రామంలో పర్యటించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో ముచ్చటిస్తూ గ్రామాల్లో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు గ్రామంలో ఉన్న రచ్చబండ వద్ద కూర్చొని గ్రామ పెద్ద మనుషులతో మాట్లాడుతు గ్రామ యోగాశేమాలు అడిగి తెలుసుకన్నారు అదేవిధంగా ఈ వర్షాకాలం తరువాత అడేల్లి రోడ్డు పనులు కూడా మొదలు పెడతాము అని అన్నారు ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.



## మధుర లబాన సమాజ్ ఆదిలాబాద్ జిల్లా నూతన కమిటీ సభ్యులను అభినందించిన ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్

సమయజ్యోతి న్యూస్ ఆగస్టు 29 బజార్ హత్నూర్

ఆదిలాబాద్ జిల్లా మధుర లబాన సమాజ నూతన కమిటీ సభ్యులు శుక్రవారం ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. అనంతరం వారిని ఎంపి అభినందించి జిల్లా అధ్యక్షుడిని శాలువతో సత్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు తమ సమాజ స్థితిగతులను, వేష భాషా గురించి ఎంపి నగేష్ వివరించారు, తమ సమాజ అభివృద్ధికి, తమ ప్రధాన లక్ష్యమైన ఎస్టీ జాబితాలో చేర్చడం ఆవశ్యకత గురించి సవివరంగా వివరించారు. ఎంపిని కలిసిన వారిలో మధుర లబాన సమాజ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సాబ్లే అమర్ సింగ్, ఉపాధ్యక్షులు పద్వాల్ సర్దార్ సింగ్, పద్వాల్ ఫత్తు సింగ్, ప్రధాన కార్యదర్శి అజడే కేవల్ సింగ్, కార్యదర్శి పద్వాల్ నానక్ సింగ్, సోషల్ మీడియా కన్వీనర్ సాబ్లే సంతోష్ సింగ్, కోశాధికారి సాతల్యా, కార్యదర్శి పద్వాల్ హుషార్ సింగ్, సభ్యులు సాబ్లే రాంచంద్, చౌహన్ ప్రేమ్ సింగ్, సలహాదారులు చౌహన్ కైలాష్ సింగ్, మోహన్ సింగ్ అడ్వకెట్, నిస్తే దిగంబర్, సాబ్లే రాయిమాల్ సింగ్, గులాబ్ సింగ్, పద్వాల్ సంతోష్, టాక్కడ రమేష్, హుషార్ సింగ్, గణేష్, గోవన్, గోతి సర్ధార్ సింగ్,సాబ్లే పాచ్చు సింగ్, సాబ్లే ప్రేమ్ సింగ్, సమాజ పెద్దలు తదితరులు ఉన్నారు.



## సెయింట్ యూజీన్ స్కూల్ లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం.

సమయజ్యోతి ఆగస్టు 29 తాళ్లపూడి

సెయింట్ యూజీన్ స్కూల్ నందు భాషా ప్రవీణ సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేవ ఫాదర్ బ్రిట్టి, రేవ ఫాదర్ అరున్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు సాహిత్యానికి ఊపిరి పోసిన తెలుగు కవుల గురించి విద్యార్థులు వివరించారు. వ్యవహారిక భాషా ఉద్యమ పిత గిడుగు రామమూర్తి జయంతి కార్యక్రమాన్ని తెలుగు భాషా దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలుగు ఉపాధ్యాయులు మురళి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విద్యావేత్త డా జె ప్రమోద్ విచ్చేసి విద్యార్థులకు తెలుగు భాషా గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను వివరించారు.పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మురళి,సంధ్యా రాణి ల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు తమ ఉపన్యాసాలు, నృత్యాలు, నటన ద్వారా తెలుగు భాషా గొప్పతనాన్ని వివరించారు.




## జాతీయ బాలచెలిమి కథల పోటీ-2025

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్, బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ సారథ్యంలో, బాలల దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో బాలచెలిమి కథల పోటీలు నిర్వహిస్తున్నారు.పిల్లలకోసం, పిల్లలు రాసిన కథలు, పిల్లల కోసం పెద్దలు రాసిన కథలు పంపవచ్చు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యాలు నివారణ, మానవతా నైతికవిలువలు, దుర్వ్యసనాలకు దూరం వంటి అంశాలకు ప్రాధాన్యం. మూఢనమ్మకాలను ప్రేరేపించేవి ఉండకూడదు, శాస్త్ర సాంకేతికాలకు అవకాశం. చేతిరాతలో (ఎ4) మూడు పుటలు, టైపులో 2 పుటలకు మించరాదు. కొత్తగా రాసిన కథలు మాత్రమే పంపాలి. గడువు: సెప్టెంబర్-20వ తేది. కథలు పంపటానికి %జుఝిఅశ్రీ: వఎఊ.ఎష్ట్రవశ్రీఱ-ఎఱఏష్త్రఝిఅశ్రీ.ఏశీఎ% మెయిల్ కు గాని చిరునామా బాల చెలిమి' కథల పోటీ'2. 2: 3-6-716,స్ట్రీట్ నం: 12, హిమాయత్ నగర్,హైదరాబాద్ -500029పంపాలని కథా రచయిత గరిపెల్లి అశోక్ కుమార్ పేర్కొన్నారు.

## మేజర్ ధ్యాన్ చంద్ జయంతి.. జాతీయ క్రీడా దినోత్సవం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడ దినోత్సవంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రాజీవ్ నగర్ మినీ స్టేడియంలో శుక్రవారం జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రాందాస్ ఆధ్వర్యంలో బాల బాలికలకు కబడ్డీ, వాలీబాల్ మరియు ఆర్చేరి క్రీడా పోటీలు నిర్వహించి, పిడి సురేష్ చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు.




## పుళాజి అమృత్ వాణి పుస్తకం ఆడియో వీడియో ఆవిష్కరణ



సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్

ఆధ్యాత్మిక గురువు సంత్ పులాజి బాబా బోధనల ఆధారంగా రచించిన పులాజీ అమృత్వాన్ని పుస్తకము ఆడియో వీడియో లను శుక్రవారం బాబా యొక్క నూట ఒకటవ జయంతిని పురస్కరించుకొని జరిగే అధికారిక జయంతి వేడుకల్లో ఆవిష్కరించనున్నట్లు పుస్తక రచయిత సుకుమార్ పేట్కులే తెలిపారు. గత 25 సంవత్సరాల క్రితం తాను రాసిన దోహేలను పుస్తక రూపంలో ఆవిష్కరించబోతున్నందుకు చాలా సంతోషంగా ఉందని అలాగే ఒక వంద ఎనిమిది దోహేలను ఆడియో వీడియో రూపంలో అద్భుతంగా తయారుచేసి భక్తుల ముందుకు తీసుకొస్తున్నందుకు సంగీతం మాస్టారు మల్లెల కబీర్దాస్ తబలావధకులు కోవా సీతారాం, కురుసంగే ఉద్ధవ్ , మహిళా నాయకురాలు సావిత్రిబాయి పూలే మహిళా మండలి సభ్యులు మనీషా గురుణులే , అంజలి పెట్కులే అందించగా మరాఠీ వ్యాఖ్యానం సతీష్ గురుణులే, తెలుగు వ్యాఖ్యానం సుకుమార్ పెట్కులే లు చేసి నాగపూర్ స్టూడియోలో రికార్డింగ్ పూర్తిచేసినట్లు వీడియో గ్రాఫర్ పెంటపర్తి ప్రహ్లాద్ అద్భుతంగా ఎడిటింగ్ చేసి సందర్భోచితంగా బాబా గారి ఆడియో వీడియోలను మిక్స్ చేయడం జరిగింది. కావున బాబా గారి భక్తులు తప్పకుండా ఈ వీడియోను, పుస్తకాన్ని ఆదరించాలని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యే ,ఎంపీ లు, జిల్లా కలెక్టర్ ఐటీడీఏ పీవో తదితరులు పాల్గొనే ఈ భవ్య కార్యక్రమంలో శనివారం 30వ తేదీ ఉదయం 10 గంటలకు ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని భక్తులు ఈ కార్యక్రమంలో అత్యధికంగా పాల్గొని బాబా గారి బోధనలు తమ జీవితానికి అన్వయించుకొని మానవ జీవిత పరమార్ధాన్ని పొందాలని కోరారు. కాకా శనివారం ఉదయం ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రంలో ఉదయం ఏడున్నర గంటలకి బాబా గారి జీవిత విశేషాలు మరియు జయంతి వేడుకల గురించిన విశ్లేషణాత్మక వివరణ సుకుమార్ పెట్కులే ద్వారా ఉంటుందని వివరించారు.

## పీ.హెచ్.సీ, ఎరువుల గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, ఆగస్టు 29 :

బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వరద ముంపు నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. అనంతరం కలెక్టర్ పెగడాపల్లి గ్రామంలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను తనిఖీ చేశారు. గిడ్డంగిలో నిలువ ఉన్న ఎరువులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ తరహాలోనే వచ్చే యాసంగి సీజన్ కు సంబంధించి కూడా ఎరువుల కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు పంపిణీ జరిగేలా ఇప్పటినుండే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా యూరియా, ఇతర ఎరువుల కొరత లేదని, రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచామని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.




## తుది ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి :కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, ఆగస్టు 29 :

మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే, ఈ నెల 30వ తేదీ వరకు తెలియజేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 2 వ తేదీన వార్డు, గ్రామ పంచాయతీల వారీగా ఫోటోతో కూడిన తుది ఓటరు జాబితాను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను ఈ నెల 28 న ప్రదర్శించడం జరిగిందన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాల విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా, ఈ నెల 30 వరకు అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, 31న అభ్యంతరాలను పరిష్కరిస్తామని, అనంతరం సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. ఈ నెల 30న( శనివారం ) మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆ సమావేశంలో పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా పై అభ్యంతరాలు తెలపవచ్చని కలెక్టర్ సూచించారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## తెలుగు వెలుగు మన గిడుగు శ్రీ విజేత లో తెలుగు భాషా దినోత్సవం

### విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు చామర్తి కి ఘన సన్మానం.

తాళ్లపూడి, ఆగస్టు 29సమయజ్యోతి

తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని తాళ్లపూడి లోని శ్రీ విజేత హై స్కూల్ నందు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు . విద్యార్థులు గిడుగు చిత్రపటానికి నివాళులు అర్పించారు.కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు డా జె ప్రమోద్ తాను తాళ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన కాలంలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేసిన చామర్తి విశ్వనాధరావు మాస్టర్ ను గిడుగు సాహితీ పురస్కారం తో గౌరవించి,సన్మానించారు. పూర్వ విద్యార్థులు గోకవరపు మాణిక్యం, కడలి కిరణ్ లు దుస్సాలువలతో విశ్వనాధరావు మాస్టర్ ను సన్మానించారు.పరస రాధాకృష్ణ మాస్టర్, విశ్వనాధరావు మాస్టర్ లు విద్యార్థులకు తెలుగు భాషా ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ఆలీ, వర్ధన్ రాజు, వెంకట్, విజయ్, కరుణ, గంగారత్నం, సలోమి, కరిష్మా, మేరీ కిరణ్మయి , చంద్రిక ,చంద్రమాలిక పాల్గొన్నారు.



# గణపతి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కార్పొరేటర్ పుష్పానగేష్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

గణపతి నవరాత్రుల సందర్భంగా శుక్రవారం నుండి జరగనున్న వినాయక నిమజ్జనం నేపథ్యంలో రామచంద్రాపురం డివిజన్ ఓల్డ్ రామచంద్రాపురం రాయసముద్రం చెరువు వద్ద నిర్మించిన కోనేరు వద్ద జిహెచ్ఎంసి ద్వారా జరుగుతున్న ఏర్పాట్లను స్థానిక రామచంద్రాపురం కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ పరిశీలించారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని క్రేన్ ఆపరేటర్స్ కు సూచించారు ఎవ్వరినీ కోనేరు లోపలకు రాకుండా చూడాలని చెరువు లో నీరు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి ఎవ్వరిని చెరువు వద్దకు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు తెలంగాణ పోలీస్ విభాగం ద్వారా ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు ఏర్పాట్లను కూడా కార్పొరేటర్ పరిశీలించారు జిహెచ్ఎంసి ఏఎంవోహెచ్ విజయ్ మోహన్ ఎస్ఎస్ కేశవులు ఎస్ఆర్పి మల్లికార్జున్ ఏఈ దివ్య ఏఈ తిరుపతయ్య సూపర్వైజర్లు మల్లికార్జున్ ఇజాజ్ ఆత్మ కమిటీ డైరెక్టర్ కావలి నగేష్ చిగురు శ్రీను అప్పల భాస్కర్ కిరణ్ గౌడ్ రాములు యాదవ్ సామ్రాట్ సుంకు స్వామి రఫీక్ మల్లేష్ హన్మంతు తదితరులు పాల్గొన్నారు



# హామీ ఇచ్చి అండగా నిలిచిన ఎమ్మెల్యే జీ ఎం ఆర్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

హామీ ఇస్తే అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచి వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించారు గత నెల రోజుల క్రితం బీహార్ రాష్ట్రానికి చెందిన సురేష్ సింగ్ యాదవ్ (34) పటాన్చెరు డివిజన్ పరిధిలోని అగర్వాల్ రబ్బర్స్ పరిశ్రమలో కాంటాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ స్థానిక కార్మికులు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఆశ్రయించారు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి 65 లక్షల రూపాయల నష్టపరిహారం అందించేలా ఒప్పించారు అనంతరం బంధువుల సమక్షంలో పరిశ్రమ ప్రతినిధులతో అంగీకార పత్రాన్ని అందించారు ఒప్పందానికి అనుగుణంగా గురువారం సాయంత్రం పటాన్చెరు లోని క్యాంపు కార్యాలయంలో పరిశ్రమ ప్రతినిధులు కార్మిక సంఘాల ప్రతినిధులు ఇతర భారతీయ సంక్షేమ సంఘం ప్రతినిధుల సమక్షంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చేతులమీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు 60 లక్షల రూపాయల నష్టపరిహారం చెక్కులను అందజేశారు ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి గూడెం మధుసూదన్ రెడ్డి వంగరి అశోక్ చంద్రశేఖర్ పరిశ్రమ ప్రతినిధి నాగరాజు ఉత్తర భారతీయ సంక్షేమ సంఘం ప్రతినిధులు సంజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు



# కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

## పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సమయజ్యోతిన్యూస్ రామచంద్రాపురం

పటాన్చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీలో కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాల్ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ్ నగర్ కాలనీవాసులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ సందేళ్ల ఆంజనేయులు కాలనీవాసులు పాల్గొన్నారు



# అతి త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం




300 కోట్ల రూపాయలతో పటాన్చెరు పట్టణంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని అతి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని గుర్తు చేశారు ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు దీంతోపాటు ప్రధానంగా పారిశ్రామికవాడల్లో జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అందుకు అవసరమైన అత్యాధునిక శస్త్ర చికిత్స విభాగాలు సైతం ఇందులో ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారుఆస్పత్రి నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ ఆస్పత్రి సూపరిండెండెంట్ చంద్రశేఖర్ టీఎస్ఎంఐడిసీ డిఈ రవీందర్ రెడ్డి ఆస్పత్రి అభివృద్ధి సంఘం సభ్యులు కంకర సీనయ్య కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అసెంబ్లీలో సింగరేణిపై చర్చించాలి:సిఐటీయు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి

పట్టణంలోని కేకే 5 గని పై సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల కష్టాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ వెంకట్ స్వామి, అల్లి రాజేందర్ లు మాట్లాడుతూ రేపటి నుండి జరిగే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో సింగరేణి సంస్థ అభివృద్ధికి సంస్థ భవిష్యత్తు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాటు సంస్థకు రావాల్సిన విద్యుత్ బకాయిలు వాటి విడుదలపై కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకొని చర్చించాలని అన్నారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే సింగరేణి నుండి తమకు రావాల్సిన 51శాతం డివిడెండ్ లో కొద్ది మేర తగ్గించుకోని సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలైన సొంతింటి కల మారుపేర్ల సమస్యలకు ఈ సమావేశాలలో ఒక పరిష్కారం చూపాలన్నారు. మెడికల్ బోర్డును ప్రతీ నెల జరపాలని స్థానిక సంస్థల ఎన్నికల లోపు సింగరేణి కార్మికుల లాభాల వాటా 35శాతం ప్రకటించి చెల్లించాలని లేదంటే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తప్పకుండా తగులుతుందని అన్నారు. గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత బాట బూట్లు ఇప్పిస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు సాక్సులు కూడా ఇవ్వకున్నా పట్టించుకోవడంలేదని అసలు ఆ నాయకులే కనిపించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ సంకె వెంకటేష్, ఏరియా ఆర్గనైజర్ బాసబోయిన కుమార్, ఆదర్శ్, దొండ నవీన్, వేణుగోపాల్, సుబేష్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్పీఐ (ఏ) మంచిర్యాల జిల్లా కమిటీని రద్దు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి



రిపబ్లిక్ ఆ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్పీఐ (ఏ) మంచిర్యాల జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగపిండి రమేష్ ఓ ప్రకటన విడుదల చేయడం జరిగింది. అతి త్వరలో మంచిర్యాల జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేస్తామని నూతన కమిటీ ఏర్పాటు చేసే వరకు ఎవరు పార్టీ పేరు చెప్పుకొని ఏలాంటి కార్యక్రమాలు చేపట్టకూడదని ఒకవేళ పార్టీని ధిక్కరించి కార్యక్రమాలు చేస్తే వారిని నిర్ధాక్షణంగా ఎలాంటి హెచ్చరిక లేకుండా పార్టీ నుండి బహిష్కరించబడుతుందని తెలియజేశారు రిపబ్లిక్ ఆ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ పిండి రమేష్ ఈ ప్రకటనలో తెలియజేయడం జరిగింది.

# అమరచింత మున్సిపాలిటీకి రెండు ఎలక్ట్రిక్ ఆటోలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ టి. కె. శ్రీదేవి రాష్ట్రంలో మూడు మున్సిపాలిటీలలో ఒకటి అమరచింత పురపాలక సంఘంను ఎంపిక చేసి 2 ఎలక్ట్రిక్ వాహనాలు కేటాయించడం జరిగినది. కేటాయించిన ఎలక్ట్రిక్ వాహనలను షోరూం మేనేజర్ మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. నాగరాజు కి ఇవ్వడం జరిగినది. పర్యావరణాన్ని కాపాడాలని ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. తడి చెత్త, పొడి చెత్త సేకరించే వాహనాలు ఇది వరకు డిజల్ తో నడిచేవి వాటి ఖర్చులు రోజు, రోజుకు తడిసి మొపెడు అయ్యేవి ఖర్చులను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు ఎంత దోహదపడతాయి. అమరచింత మున్సిపాలిటీకి చెత్త సేకరణ కోసం రెండు ఎలక్ట్రిక్ ఆటోలాను మంజూరు చేసిన కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపాలిటీ అడ్మినిస్ట్రేషన్ అధికారి టి.కె. శ్రీదేవి కి,సంబంధిత మున్సిపల్ అధికారులకు మాజీ మున్సిపాలిటీ చైర్మన్ వి. మంగమ్మ నాగభూషణం గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.




# సందర్శకులు వెళ్లకుండా... పోలీసుల చర్యలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

నిజామాబాద్ జిల్లా పోచంపాడు శ్రీ రామ్ సాగర్ ప్రాజెక్టును సందర్శించడానికి ప్రజలు ఎవరు వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అన్ని ప్రధాన రహదారుల గుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. శ్రీరామ్ సాగర్ పోచంపాడుకు సందర్శకులు వెళ్లకుండా పోచంపాడు ఎక్స్ రోడ్ వద్ద బాల్కొండ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టగా, పోలీస్ సిబ్బంది, మెండోరా ఎస్సై సుహాసిని, మండల అధికారులు సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.



# గణనాథుడికి కంది మౌనా శ్రీనివాస రెడ్డి పూజలు

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ఆదిలాబాద్ జిల్లాలో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో ప్రతిష్టించిన విఘ్నేశ్వరుడిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి దర్శించుకున్నారు.గణపతి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.పూజ అనంతరం గణనాయకునికి హారతి తో పాటు నైవేద్యాలు సమర్పించారు.ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆమె వినాయకుడిని ప్రార్థించారు.



# వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, శుక్రవారం భీంగల్ మండల కేంద్రం, గోన్ గొప్పుల సికింద్రాపూర్ గ్రామాలలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. భారీ వరద దాటికి ధ్వంసమైన రోడ్లు, వంతెనలు, పంట పొలాలను పరిశీలించారు. ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా రహదారులు వంతెనలు త్వరితగతిన పునుద్దరించాలని, పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని ప్రభుత్వ అధికారులకు సూచించారు. ప్రజా ప్రభుత్వం ఇప్పటికే వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిష్కార చర్యలు చేపట్టుటకు అధికార యంత్రాంగాన్ని ఆదేశించిందని అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి ఫీల్డ్ విజిట్స్ చేస్తూ అధికార యంత్రంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో జరిగిన నష్టాలను సంబంధిత మంత్రులకు, ముఖ్యమంత్రికి నివేదిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం,పాల్గొన్న ఎంపీ గెడెం నగేష్,జిల్లా కలెక్టర్ రాజర్షి షా

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం టిటిడి కల్యాణ మండపం,ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.టిటిడి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీ గేడెం నగేష్,జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి భారత గొప్ప హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం క్రీడలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ గేడెం నగేష్,కలెక్టర్ రాజర్షి షా పాల్గొని,మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ క్రీడా మహోత్సవం లాగిన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపి,జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాలు జిల్లాలో క్రీడలకు ప్రోత్సాహం ఇచ్చే దిశగా ముందడుగు వేస్తాయని,యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు తోడ్పడతాయని,మేజర్ ధ్యాన్ చంద్ భారత హాకీ జట్లకు ఒలింపిక్స్ లో మూడు బంగారు పతకాలు అందించి దేశ ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేశారనీ అన్నారు.ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటామని,క్రీడాకారులు ఉత్సాహంతో పాల్గొంటారని, పోటీతత్వం,సహకారం,శారీరక శ్రేయస్సు యొక్క శక్తివంతమైన జ్ఞాపకార్థం.ఈ ప్రత్యేక రోజు క్యాలెండర్‌లో మాత్రమే కాదు,హాకీ మైదానంలో అతని ఆట లోని మాయ సామర్థ్యాలు ఒక దేశాన్ని మెల్కొల్పిన మేజర్ ధ్యాన్ చంద్ వారసత్వానికి సంతోషకరమైన వేడుకని పేర్కొన్నారు.ఈ సంవత్సరం థీమ్ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని,'ఏక్ గంటా,ఖేల్ కే మైదాన్ మే' (ఒక గంట,ఆట స్థలంలో) అనే థీమ్ తో 'ఫిట్ ఇండియా' ఉద్యమం మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా కొనసాగనుం దన్నారు.ఈ ఉద్యమం ఆగస్టు 31 వరకు జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీనివాస్,జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి,ఇతర అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.





## సరూర్‌నగర్‌లో మరో భర్త హంతకురాలు
### ప్రయుడితో కలసి భర్తను లేపేసిన భార్య

హైదరాబద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

ఈ మధ్యకాలంలో ప్రియుడితో కలిసి భర్తలను హతమారుస్తున్న భార్యల కేసుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా అలాంటి ఘటన మరోటి చోటుచేసుకుంది. కొందరు పెళ్లికి ముందు ప్రేమ వ్యవహారం కారణంగా భర్తలను హత్య చేస్తుంటే.. మరికొందరు పెళ్లి తర్వాత వివాహేత సంబంధం పెట్టుకొని భర్తలను కడతేరుస్తున్నారు. తాజాగా నగరంలోని సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇలాంటి దారుణమే చోటు- చేసుకుంది. కోదండరామ్‌నగర్‌లో ప్రియుడు హరీశ్‌తో కలిసి భార్య.. భర్తను చంపేసింది. నాగర్‌కర్నూల్‌కు చెందిన శేఖర్, చిట్టిలకు 16 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. బతుకుదెరువు కోసం వీరిద్దరు హైదరాబాద్.. సరూర్‌నగర్‌కు వలస వచ్చి జీవిస్తున్నారు. శేఖర్ ప్రైవేటు- డ్రైవర్ కాగా.. చిట్టి ఇళ్లలో పని చేసేది. తాజాగా భర్త శేఖర్ వివాహేతర సంబంధం గురించి చిట్టిని నిలదీయడంతో అతన్ని హత్య చేయాలని కుట్ర పన్నింది. అర్ధరాత్రి ప్రియుడు హరీశ్‌ని ఇంటికి పిలిపించి నిద్రలో ఉన్న భర్తను హత్య చేసింది. ఆ తర్వాత 100కు ఫోన్ చేసి నిద్రలోనే భర్త చనిపోయాడని భార్య చెప్పింది. అయితే పోలీసులకు భార్యపై అనుమానం రావడంతో తమదైన శైలిలో ప్రశ్నించారు. దీంతో విచారణలో భార్య చిట్టి నేరం అంగీకరించింది. దీంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న చిట్టి ప్రియుడు హరీశ్ గురించి పోలీసులు గాలిస్తున్నారు.

## ఓబుళాపురం కేసులో సుప్రీంలో శ్రీలక్ష్మి పిటిషన్
### హైకోర్టు ఆదేశాలపై స్టే విధించిన సుప్రీం

న్యూఢిల్లీ,ఆగస్ట్29(సమయజ్యోతి ):

ఓబుళాపురం అక్రమ మైనింగ్ వ్యవహారంపై ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. అక్రమ మైనింగ్ కేసులో శ్రీలక్ష్మి పేరును తొలగిస్తూ గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం కేసులో మరోసారి వాదనలు విని నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ హైకోర్టుకు సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో వాదనల అనంతరం.. ఇటీవల హైకోర్టు తీర్పు వెలువరించింది. శ్రీలక్ష్మి పేరును తొలగించడం కుదరదని, ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ శ్రీలక్ష్మి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

## బావి మీద గణపతి విగ్రహంను దర్శించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :



రాష్ట్రంలోనే అతి ఎత్తైన గణపతులలో ఒకటైన ఆదిలాబాద్ పట్టణంలోని రాణి సతీష్ కాలినీ లో గల బావి మీద గణపతి,కుమార్ జనతా మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించబడిన 54 అడుగుల ఎత్తైన గణపతి విగ్రహంను శుక్రవారం రోజు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ దర్శించుకొని పూజా కార్యక్రమాలను నిర్వ హించారు. మొదటగా సాంప్రదాయ వాయిద్యాల నడుమ జిల్లా ఎస్పీకి ఘన స్వాగతం పలికిన కమిటీ సభ్యులు గణపతి విగ్రహ ప్రతిష్ట చరిత్రపై వివరణ అందిం చారు.తదుపరి మహాగణపతికి వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ పూజలు నిర్వహించారు.పూజ అనంతరం కమిటీ సభ్యులు జిల్లా ఎస్పీకి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి,ఆదిలాబాద్ ఒకటవ పట్టణ సీఐ బి సునీల్ కుమార్,గణపతి చిత్రకారుడు రమేష్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి,యువజన సంఘాల నాయకుడు బాల శంకర్ కృష్ణ,కుమార్ జనతా గణేష్ మండల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోచారం ప్రాజెక్టులో చిక్కుకున్న యువకులు

మెదక్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్‌లోని పోచారం ప్రాజెక్టు వరద ఉధృతితో పోచంరాల్ వద్ద చిక్కుకున్న 8 మంది యువకులను రక్షించేందుకు ఆర్మీ సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం లింగంపల్లికి చెందిన యువకులు వినాయకచవితి రోజు విగ్రహాన్ని తీసుకెళ్లేందుకు హవేలీ ఘన్‌పూర్ వచ్చారు. తిరిగివెళ్లే క్రమంలో పోచారం ప్రాజెక్టు వరదతో అక్కడి వంతెన తెగిపోయింది. అవతలి ఒడ్డున చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఆర్మీ సిబ్బంది సహకారంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం ఆర్మీ సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని రక్షించేందుకు యత్నిస్తున్నారు.

## సాయం కోసం వచ్చిన బోటు బోల్తా ప్రమాదం నుంచి బయటపడ్డ ఆర్మీ జవాన్

మెదక్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

మెదక్ జిల్లాలో ఆర్మీ జవాన్లకి పెను ప్రమాదం తప్పింది. రెస్క్యూ కోసం ట్రయల్ వేస్తుండగా బోటు బోల్తా పడింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది జవాన్లను రక్షించేందుకు రంగంలోకి దిగారు. తాళ్ల సాయంతో జవాన్లను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కాగా ఈ నెల 27న వినాయకుని విగ్రహం కొనుగోలు చేసేందుకు కామారెడ్డి జిల్లా లింగంపల్లి గ్రామానికి చెందిన 8 మంది చిన్నారులు మెదక్ కు వచ్చారు. భారీగా కురిసిన వర్షాలతో పోచారం వరద ఎక్కువ కావడంతో మూడు రోజులుగా పోచమ్మరాల్ గ్రామంలో చిన్నారులు తలదాచుకున్నారు. మూడు రోజులుగా గ్రామస్థులు 8 మంది చిన్నారుల ఆలన పాలన చూసుకున్నారు. ఈ క్రమంలో చిన్నారులను ఆర్మీ అధికారులు వారి ఇంటికి పంపేందుకు ప్రయత్నం చేయగా విఫలం అయ్యింది. దీంతో తిరిగి మెదక్ లోని పునరావాస కేంద్రానికి చిన్నారులను తరలించారు. కాగా మెదక్ జిల్లాలో కుండపోత వర్షాలు వణికించిన విషయం తెలిసిందే. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి.

# జిఎస్టీ సవరణల నష్టాన్ని కేంద్రమే భరించాలి
### రాష్ట్రాల ఆదాయం దెబ్బతినకుండా చూడాలి
### జిఎస్టీ కౌన్సిల్ భేటీలో పలు రాష్ట్రాల ఆర్థికమంత్రుల డిమాండ్

న్యూఢిల్లీ,ఆగస్ట్29(సమయజ్యోతి ):

కేంద్రం వస్తు సేవల పన్ను జిఎస్‌టి రేటు నిర్మాణాన్ని సవరించడంతో ఆదాయ నష్టాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు పరిహారం చెల్లించాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు శుక్రవారం డిమాండ్ చేశాయి. జిఎస్‌టి రేటు నిర్మాణ సవరణ ప్రతిపాదనతో రాష్ట్రాలకు సుమారు రూ.1.5కోట్ల నుండి రూ.2 లక్షల కోట్ల వరకు ఆదాయ నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నాయి. ఎనిమిది రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, కేరళ,పంజాబ్, తమిళనాడు, తెలంగాణ మరియు పశ్చిమబెంగాల్ రాష్ట్రాల ఆర్థికమంత్రులు సెప్టెంబర్ 3 మరియు 4 తేదీల్లో జరిగే తదుపరి జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో తమ ప్రతిపాదనను సమర్పించాలని నిర్ణయించారు. రేటు- నిర్మాణ సవరణ, ఆదాయ నష్టాన్ని సమతుల్యం చేయడానికి అల్ట్రా లగ్జరీ, సిగరెట్ వంటి వస్తువులపై ప్రతిపాదిత 40శాతం రేటుతో పాటు అదనపు సుంకాన్ని విధించాలని సూచించాయి. ఈ లెవీ నుండి వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆదాయ భద్రతను లెక్కించడానికి బేస్ ఇయర్‌ను 2024-25గా నిర్ణయించాలని ఎనిమిది రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. ప్రతిపాదిత అదనపు లెవీ విధించిన తర్వాత కూడా లోటు ఉంటే, కేంద్ర ప్రభుత్వం అదనపు లెవీ భవిష్యత్ రసీదులకు బదులుగా సెక్యూరిటీ- కల్పించబడిన రుణాలను సేకరించాలని రాష్ట్రాలు తమ ప్ర తిపాదనలో పేర్కొన్నాయి.సమావేశం అనంతరం ఎనిమిది రాష్ట్రాల ఆర్థికమంత్రులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను కాపాడాలని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలకు నష్టం కలిగితే.. ప్రజలు, అభివృద్ధి పనులు ప్రభావితమవుతాయని, రాష్ట్ర స్వయంప్రతిపత్తికూడా దెబ్బతింటుందని అన్నారు. ప్రతి రాష్ట్రం ప్రస్తుత జిఎస్‌టి ఆదాయంలో 15-20శాతం నష్టపోతున్నట్లు- అంచనా వేశామని కర్నాటక ఆర్థికమంత్రి కృష్ణబైరె గౌడ తెలిపారు. 20శాతం ఆదాయనష్టం దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక నిర్మాణాన్ని తీవ్రంగా అస్థిరపరుస్తుందని అన్నారు. ఆదాయం స్థిరీకరించే వరకు రాష్ట్రాలకు ఐదేళ్ల పరిహారం చెల్లించాలని సూచించారు. జిఎస్‌టి అమల్లోకి వచ్చినపుడు ఆదాయ తటస్థ రేటు 14.4శాతం ఉందని, తర్వాత పన్ను రేటు నిర్మాణ సవరణ తర్వాత నికర పన్ను రేటు 11శాతానికి తగ్గింది. జిఎస్‌టి రేట్లను తగ్గించడం, స్లాబ్‌లను సవరించడం అనే కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత ప్రతిపాదనతో నికర పన్ను రేటు- 10శాతానికి పడిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రేటు నిర్మాణ సవరణకు తాము అంగీకరి స్తున్నామని, అయితే రాష్ట్రాలకు పరిహారం చెల్లించాలని హిమాచల్ ప్రదేశ్ సాంకేతిక విద్యమంత్రి రాజేష్ ధర్మాని పేర్కొన్నారు. రేటు- నిర్మాణ సవరణ ప్రయోజనాలు సామాన్యులకు చేరేలా, లాభాలను గుర్తించేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పంజాబ్ ఆర్థికమంత్రి హర్పాల్ సింగ్ చీమ డిమాండ్ చేశారు.

## పెద్దారెడ్డికి సుప్రీంలో ఊరట
### సొంత నియోజకవర్గానికి వెళ్లేందుకు అనుమతి

న్యూఢిల్లీ,ఆగస్ట్29(సమయజ్యోతి ):

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి భారీ ఊరట లభించింది. పెద్దారెడ్డి తాడిపత్రి ఎంట్రీకి సుప్రీంకోర్టు అనుమతించింది. తనను తాడిపత్రిలోకి రాకుండా అడ్డుకుంటున్నారంటూ సుప్రీంకోర్టును మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆశ్రయించారు.. దానిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది.. అయితే, తన సొంత నియోజకవర్గంలోకి అనుమతించకుండా టీడీపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు

# ఉపరాష్ట్రపతి ఎన్నికలపై బిఆర్‌ఎస్ అనాసక్తి

## ఎన్నికకు దూరంగా ఉండాలనేయోచనలో పార్టీ?

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

ఉప రా ష్ట్రపతి ఎన్నికల సమయం దదగ్గర పడుతున్నా విపక్ష బిఆర్‌ఎస్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాంగ్రెస్, ఎన్‌డిఎ కూటమిలకు తాము దూరమని ఇప్పటికే కెటిఆర్ ప్రకటించారు. ఈ రెండింటి వల్ల ఒరిగిందేమీ లేదని అంటోంది. దీనిని బట్టి చూస్తుంటే ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉండాల ని బిఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఎన్నికల్లో పాల్గొనడం వల్ల వచ్చే ఉపయోగం ఏమీ లేదని కెటిఆర్ గట్టిగానే వాదిస్తున్నారు. దీంతో వచ్చే నెల 9న జరుగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికిలో ఎన్‌డిఎ అభ్య ర్థికి గానీ, విపక్షాల అభ్యర్థికి గానీ ఓటు వేయకుండా తటస్థంగా ఉండాలని పా ర్ట అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్ర నికి సెప్టెంబర్ 9లోపు ఎవరు 2 లక్షల టన్నుల ఎరువులు తీసుకువస్తా రో ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి బిఆర్ ఎస్ మద్దతు ఇస్తుందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తేల్చి చెప్పారు. అయితే ఇప్పటివరకు కెటిఆర్ డిమాండ్ పై కాంగ్రెస్ పార్టీ కానీ, బిజెపి పార్టీ స్పందించలేదు. నిజానికి యూరియా సమస్య కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉంటుంది. దీనికి కాంగ్రెస్‌తో పెద్దగా సంబంధం లేదు. అందువల్ల అధికార పార్టీ యూరియా సరఫరా చేస్తే బిజెపికి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ రాజీనామాతో ఇప్పుడు ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు జర గబోతున్నాయి. ఓటింగ్ విషయంలో బిఆర్‌ఎస్ వ్యూహం ఏంటనే విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికలో పార్లమెంట్ ఉభయ సభల సభ్యులే ఓటర్లు. బిఆర్‌ఎస్‌ఉకు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేదు. ప్రస్తుతం బిఆర్‌ఎస్ పార్టీకి రాజ్యసభలో వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావు, పార్థసారథి రెడ్డి, కె.ఆర్ సురేష్ రెడ్డిలు ఎంపీలుగా కొనసాగుతున్నారు. వీళ్లు ఎవరికి ఓటే స్తారనేది ఆసక్తికరంగా మారింది. 2022లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికలలో ఎన్‌డిఎ కూటమి తరఫున ద్రౌపది ముర్ము, ఇండియా కూటమి తరఫున మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హా పోటీ- చే యగా, అప్పుడు తెలంగాణ సిఎంగా ఉన్న కెసిఆర్ ఇండియా కూటమి అభ్యర్థి యశ్వంత్ సి న్హాకు మద్దతు ప్రకటించారు ప్రస్తుతం ఉప రాష్ట్రపతి ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో బిఆర్‌ఎస్ ఎలాంటి వైఖరిని తీసుకోబో తున్నారన్నది చర్చనీయాంశంగా మారిం ది. బిజెపిలో బిఆర్‌ఎస్ పార్టీని విలీనం చే సేందుకు ప్రయత్నాలు జరిగాయనే ప్రచా రం ఇటీ-వల విస్తృతంగా జరిగింది. ఇలాం టి సమయంలో ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు ఇస్తే బిజెపి, బిఆర్‌ఎస్ ఒక్కటే అనే అంటూ మరోసారి విలీన ప్రచారం తెర మీదికి వ చ్చే అవకాశం ఉంటుందని, ఒకవేళ విపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇస్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని సపోర్ట్ చేశారన్న ప్రచారం జరుగుతుందని పార్టీ అధి ష్టానం భావిస్తున్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రాధాన్యతల కారణంగా ఎవరికి మద్దతు ఇచ్చినా సమస్య తలెత్తిందని, కాబట్టి ఉపరాష్ట్ర ఎన్నికలో తటస్థంగా ఉండడమే ఉత్తమం అని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కెటిఆర్ కూఆ తన సన్నిహితలు వద్ద ఇలాంటి వ్యాఖ్యలే చేశారని అంటున్నారు. అంతెందుకు బహిరంగంగా కూడా ఆయన ఇవే వ్యాఖ్యలు చేశారు. కాబట్టి ఉపరాష్ట్రపతి ఎన్నికకుదూరంగా ఉండడమే మంచిదనే అభిప్రాయంలో పార్టీ ఉంది.

# మూసీనదికి పెరిగిన వరద

## మంచిరేవ్ల వద్ద బ్రిడ్జిపై నుంచి ప్రవాహం

## ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు మూసివేత

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

ఎగువ నుంచి జంట జలాశయాలకు భారీగా వరద వస్తున్నది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు పూర్తిస్థాయిలో నిండటంతో జలమండలి అధికారులు ఉస్మాన్‌సాగర్ 8 గేట్లు ఎత్తారు. మూసీ నదిలో వరద ఉధృతి పెరగడంతో మంచిరేవుల బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తున్నది. ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ.. నార్సింగి ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు మూసివేసారు.మూసీ నదిలో వరద ఉధృతి పెరగడంతో మంచిరేవుల బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తున్నది. అప్రమత్తమైన అధికారులు నార్సింగి వద్ద ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డును మూసివేశారు. సర్వీస్ రోడ్డు ఎంట్రీ-, ఎగ్జిట్‌ను మూసివేడంతో మంచిరేవుల-నార్సింగి మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు ఇతర మార్గాల ద్వారా వెళ్లాలని అధికారులు సూచించారు. ఉస్మాన్‌సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో ఎనిమిది గేట్లు- ఎత్తి 4,096 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1790 అడుగులు. ప్రస్తుతం 1789.45 అడుగుల వద్ద ఉన్నది. అదేవిధంగా హిమాయత్‌సాగర్ జలాశయానికి 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 3 గేట్లు- ఎత్తి 2,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1763.50 అడుగులు. కాగా, ప్రస్తుతం 1762 అడుగులు నీటిమట్టం ఉన్నది.

# కమిషన్ చెల్లింపులో నిర్లక్ష్యం

## 1నుంచి ఆందోలన చేస్తామన్న రేషన్ డీలర్లు

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్లకు రావలసిన కమిషన్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉచిత బియ్యం పథకాన్ని విజయవంతం చేసినట్లు- గొప్పలు చెప్పకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం డీలర్ల కమిషన్ డబ్బులు ఇవ్వడంతో తీవ్ర జాప్యం చేస్తోందని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని రేషన్ షాప్‌ల బంద్ నిర్వహిస్తున్నట్లు-, సెప్టెంబర్ 4వ తేదీన అసెంబ్లీ ముట్టడిస్తామని ఆయన గురువారం సివిల్ స్లపై భవన్ వద్ద ఆయన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు నెలల నుంచి డి రేషన్ డీలర్లకు కమిషన్ డబ్బులు, రెండు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న గన్ని బ్యాగ్స్ డబ్బులు రావడంలేదన్నారు. దీంతో రేషన్ డీలర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆగస్టు 31వ తేదీ వరకు రేషన్ డీలర్లకు కమిషన్ డబ్బులు విడుదల చేయకుంటే సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రేషన్ షాపులు మూసివేసి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు చేస్తామన్నారు. రెండో తేదీన ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా, మూడో తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. చివరకు సెప్టెంబర్ నాల్గొవ తేదీన రాష్ట్రంలోని రేషన్ డీలర్లతో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు, కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వంగరి నాగరాజు, మల్లికార్జున్ గౌడ్, వైకుంఠం, అజిజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్‌కు అనుకూల వాతావరణం

## సాగు చేసే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహం

**ఖమ్మం,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

రాష్ట్రంలో ఆయిల్ పాం సాగుకు అనుకూల వాతావరణం ఉందని, దీంతో జిల్లాలో రైతులను పెద్ద ఎత్తున ప్రోత్స హిస్తున్నారు. పంట పెట్టుబడులను తగ్గించే ప్రయత్నంలో భాగంగా అనేక జిల్లాల్లో ఆయిల్ పామ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందచేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దీనిని కొనసాగిస్తోంది. ప్రత్యేకించి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కూడా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు పదేపదే ఇదే విషయం చెప్పి వారిని ఆయిల్ పామ్ సాగువైపు మళ్లేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున సాగు చేసేందుకు ముందు కొచ్చారు. దీనికి సంబంధించి హార్టికల్చర్ శాఖ ఒక నివేదిక రూపొందించింది. ఖమ్మం, సిద్దిపేట, నిజామాబాద్ తదితర జిల్లాల్లో ఇప్పటికే సాగు చేపట్టారు. వాతారణంతో పాటు,నీటి లభ్యత కూడా ఎక్కువగా ఉందని అధికారులు అంచనాకు వచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం,వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పంట సాగు చేసేందుకు అనుకూలంగా ఉంది. నూనె గింజల ఉత్పత్తికి ఉష్ణోగ్రతలు,సాగుకు అనుగుణంగా దిగుబడి ఇచ్చే నేలలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఫలితంగా రైతాంగం ఆయిల్ పాం సాగుకు ఆసక్తి చూపుతు న్నారు. ఎకరా వరి సాగయ్యే నీటితో మూడెకరాల పామాయిల్ పంట సాగవుతుందని, అంతర పంటలతో అధిక లాభాలు వస్తాయని చెబుతున్నారు. ఆయిల్ పాం సాగుపై మొదటి నుంచీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు వర్షాలు కురిసి నీరు సమృద్ధిగా ఉంటే వరి పండిస్తున్నారు. ఆయిల్ పాం ప్రత్నామ్నాయ పంట కానుంది. రాబోయే రెండేండ్లలో తెలంగాణ వ్యాప్తంగా 42,250 ఎకరాల్లో సాగుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కుంది. ఇప్పటికే 2,500 ఎకరాల్లో తెలంగాణ ఉద్యానవన శాఖ ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. మొత్తం 246 మండలాలు అనుకూలంగా ఉన్నట్లు సర్వేలో తేలింది. ఈ సాగు వల్ల రైతులను పంట మార్పిడి వైపు ప్రోత్సహించినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.అందుకే దీనివైపు రైతులు మొగ్గు చూపేలా చేస్తోంది. ఖమ్మం, నిజామబాద్ లాంటి జిల్లాలు ప్రయోగాలకు ప్రసిద్ధం. ఇప్పటికైతే ఇక్కడ అడుగు పడలేదు. అయితే ఏదైనా పంటప్రయోగం జరగగాలంటే ఇక్కడి రైతులు ముందుకు వస్తారు. వ్యవసాయశాఖ ఈ మేరకు ఆయా జిల్లాల్లో అనుకూలంగా ఉన్న పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ప్రోత్సాహం అందించడంతో పాటు సబ్సిడీ కూడా అందుతున్న కారణంగా ఆయిల్ పామ్ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయిల్ పామ్ సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. మొక్కదశ నుంచి మార్కెటింగ్ వరకు అన్ని రకాలుగా సాయం చేయనుంది. రైతులకు మొక్కను రూ.25లకే అందిస్తారు. మొక్కలను కూడా ఉపాధిహామీ పథకం కింద అధికారులు నాటించనున్నారు. మొక్కలను పెంచడానికి ఈ ప్రాంతంలోనే అధికారులు నర్సరీని కూడా ఏర్పాటు చేయనున్నారు. సబ్సిడీపై వారికి డ్రిప్ పరికరాలు ఇవ్వనున్నారు. మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు జైపూర్ వద్ద ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నారు. దీంతో రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కోసం తిప్పలు కూడా తప్పనున్నాయి. ఇక సాగు విషయానికి వస్తే ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని, నామమాత్రపు ఎరువులు వాడితే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

# మానేరులో చిక్కుకున్న వ్యక్తి

## -ఓ తల్లి ఆందోళనతో రంగంలోకి దిగిన బృందం

## -మొత్తం అయిదుగురిని కాపాడిని సహాయక సిబ్బంది

**రాజన్నసిరిసిల్ల,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఒక తల్లి ఆందోళన గుర్తించిన రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి. వరదల్లో చిక్కుకున్న తన కుమారుడు జంగం స్వామి కోసం తల్లి లక్ష్మి 30 గంటల పాటు ఎదురుచూసింది. పనుల నిమిత్తం బయటకు వెళ్లిన స్వామి భారీ వర్షాల కారణంగా సుడిగుండం వరద నీటిలో చిక్కుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ తల్లిగుండె.. ఒక్కసారిగా బద్దలైంది. తన కొడుకు తిరిగి వస్తాడో.. రాడో.. అన్న భయంతో ఆవేదన చెందింది. అధికారుల కాళ్ల మీద పడుతూ.. తన కొడుకుని రక్షించాలని వేడుకుంది. అయితే.. స్వామితో పాటు మరో నలుగురు వ్యక్తులు మానేరులో చిక్కుకుపోయారు. దీంతో వారిని రక్షించడానికి రెస్క్యూ బృందం ఎంత ప్రయత్నం చేసిన ప్రతికూల వాతావరణం కారణంగా ప్రయత్నాలు విఫలమయ్యాయి. చూస్తుండగానే.. 30 గంటలు గడిచిపోయాయి. వారు మానేరుపైనే ఉన్నారు. వారు తిరిగి వస్తారా.. అనే సందేహం అందరిలో మొదలయ్యింది. దీంతో ఇదంతా చూస్తున్న తల్లి ఆవేదన కోపం రూపంలో బయటకు వచ్చింది. నాయకులు తన కొడుకును రక్షించలేకపోతే వారు నాయకులుగా ఉండి ఎందుకని మండిపడ్డింది. తన కుమారుడిని రక్షించడానికి మళ్లీ ప్రయత్నించాలని ఆమె అధికారులను కోరింది. దీంతో రెస్క్యూ బృందం కొన్ని గంటలు శ్రమించి.. స్వామితో పాటు- మానేరులో చిక్కుకపోయిన వారిని రక్షించింది. దీంతో ఆ తల్లి 30 గంటల నిరీక్షణకు తెరపడింది. కొడుకు తిరిగి రావడంతో.. తల్లి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇద్దరు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. తనను రక్షించిన రెస్క్యూ బృందంకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇది రెండవ జీవితామని స్వామి పేర్కొన్నారు.

# జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

## -పోలీసుల చొరవతో మెల్లగా కదిలిన వాహనాలు -కిలోమీటర్ల మేర నిలిచి పోయిన వేలాది వాహనాలు

**కామారెడ్డి,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని 44వ నంబరు జాతీయ రహదారి పై భారీగా ట్రాఫిక్ జామ్ శు క్రవారం కూడా కొనసాగింది. పోలీసులు రంగంలోకి దిగి వాహనాలు మెల్లగా కదిలేలా చర్యలు చేపట్టారు. రోడ్డు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు నెమ్మదిగా కదిలాయి. సుమారు గంటకు పైగా ఈ పరిస్థితి నెలకొంది. సదాశివనగర్ మండలం నుంచి భిక్కనూర్ టోల్‌గేట్ వరకు సుమారు 15 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. బుధ వారం, గురువారం కురిసిన వర్షాలకు టెక్రియాల్, సారం పల్లి వద్ద బ్రిడ్జి కోతకు గురైంది. మరోచోట రోడ్డు కొట్టుకు పోయింది. ఈ నేపథ్యంలోనే బుధవారం నుంచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గురు వారం రాత్రి కూడా వాహనాలు పెద్దఎత్తున నిలిచి పోవడంతో పరిస్థితిని ఎస్పీ రాజేశ్ చంద్ర పర్యవేక్షించారు. ట్రాఫిక్ జామ్ సమస్యలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. త్వరగా రహదారులకు మరమ్మతులు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలావుంటే కామారెడ్డి జిల్లాను భారీ వర్షం కకావికలం చేసింది. దీనినుంచ ఇప్పట్లో తేరుకునేలా లేదు. కామారెడ్డి పట్టణంతోపాటు రాజంపేట, భిక్కనూరు, దోమకొండ మండలాల్లో జనజీవనం స్తంభించింది. రాజంపేట మండలంలోని ఆర్గొండ గ్రామంలో 24 గంటల్లో అత్యధికంగా 44 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మరికొన్ని మండలాల్లో 20 సెం.మీ. మేర వర్షం కురిసింది. కామారెడ్డి పట్టణం లోని పెద్దచెరువు అలుగు ఉధృతంగా ప్రవహించ డంతో హైదరాబాద్‌కు వెళ్లే మార్గంలోని పైవంతెన మీది నుంచి నీరు ప్రవహించింది. సిరిసిల్ల మార్గంతోపాటు- నిజాంసాగర్ మార్గంలోనూ రోడ్లు ధ్వంసమవడంతో పట్టణా నికి మూడు వైపులా రాకపోకలకు ఆటంకం కలిగింది. పెద్దచెరువు అలుగుతో కిందనున్న జీఆర్ కాలనీ లో ఇళ్లలోకి నీళ్లు చేరాయి. పదుల సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. భిక్కనూరు- తలమడ్ల స్టేషన్ల మధ్యలో రామేశ్వరపల్లి గ్రామశివారులో వరద ఉధ్ధృతికి రైల్వేకట్ట తెగింది. రైల్వేట్రాక్ కింద కంకర, మట్టి కొట్టుకుపోయాయి. దీంతో నిజామాబాద్-హైదరా బాద్ మార్గంలో రైళ్లు నిలిచాయి. జాతీయ రహదారి 44పై భిక్కనూరు టోల్‌గేట్ వద్ద ఎడ్లకట్ట వాగు ప్రవాహం చేరడంతో పాక్షికంగా రోడ్డు దెబ్బతింది. భిక్కనూరు వద్ద రహ దారిపై 20 కి.మీ.కు పైగా వాహనాలు గంటల తర బడి నిలిచాయి. అధికారులు వారికి ఆహారంతోపాటు- తాగునీరు సమకూర్చారు. కామారెడ్డి మండలం క్యాసంపల్లి వద్ద నిజామాబాద్ వెళ్లే మార్గంలో గురువారం జాతీయ రహదారి కుంగిపోయింది. టేక్రియాల్ వద్ద పెద్దచెరువు ప్రవా హంతో ఒకవైపు మొత్తం జాతీయ రహదారి కుంగింది. జిల్లావ్యాప్తంగా 130 రోడ్లు ధ్వంసమయ్యాయి. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం హొన్నాజీపేట, వాడి గ్రామాల్లో చెరువు కట్టలు తెగడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం గ్రామ ప్రజలను వరద నీరు చుట్టు-ముట్టింది. రెంజల్ మండలంలోని కందకుర్తి గోదావరి ఒడ్డున ఉన్న ఆశ్రమంలోకి నీరు చేరడంతో సాధువుల్ని, పశువుల్ని రక్షించేందుకు రెస్క్యూ సిబ్బంది శ్రమిస్తున్నారు.

# ఎసిబికి చిక్కిన పంచాయితీ కార్యదర్శి

**కరీంనగర్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

అవినీతి నిరోధక శాఖ అధికారులు ఎన్ని దాడులు చేసినా.. ఎంత మందిని సస్పెండ్ చేస్తున్నా అవినీతి అధికారుల తీరు మారటం లేదు. చిన్న విషయానికి కూడా పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లాలో అలాంటి ఓ లంచగొండి అధికారిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లా ఏసీబీ దాడుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు పంచాయతీ కార్యదర్శి. వీణవంక మండలం చల్లూర్ గ్రామం లో ఇంటి నెంబర్ అలాట్ చేయడానికి ఇరువై వేల రూపాయలు లంచం డిమాండ్ చేశాడు పంచాయతీ కార్యదర్శి నాగరాజు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు బాధితుడు. చెప్పిన టైం లో డబ్బులు ఇవ్వాల్సిందిగా చెప్పిన అధికారులు.. బాధితుడి నుంచి రూ. 25 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హండెడ్ గా పట్టుకున్నారు.

# మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: వివేక్

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్ లో కార్యకర్తల భేటీలో పాల్గొన్న ఆయన.. మైనార్టీల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. అందరికీ అందు బాటులో ఉంటామని తెలిపారు. ఒక్క సారి హామీ ఇచ్చామంటే తప్పకుండా నెరవేరు స్తామన్నారు. రహమాత్ నగర్ లో రూ. 20 కోట్ల పనులు మంజూరు చేశామన్నారు. తొందలోనే ఆ పనులు మొదలుపెడతామని చెప్పారు. రహమత్ నగర్ లో ఉన్న శ్మశాన వాటిక సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు మంత్రి వివేక్. ఈ విషయం గురుంచి కలెక్టర్, వక్ఫ్ బోర్డు చైర్మన్ తో మాట్లాడి స్థలం కోసం సర్వే చేయమని ఆదేశాలు ఇచ్చారని చెప్పారు.

# సిఎంను కలిసిన ఓవైసీ బ్రదర్స్

**హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ,మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ- సభ్యులు శక్రవారం ఆయన నివాసంలో కలిశారు. మిలాదున్ నబీ సందర్భంగా పురాతన మసీదులు, దర్గాలను అలంకరించాలని, ఉచిత్ విద్యుత్ సరఫరా చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 14 న రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలకు అనుమతి ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు.



# జిల్లాలో వరదల్లో కృషి చేసిన సహాయక బృందాలు

## 775 మందిని కాపాడిన ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ టీమ్‌లు

**నిజామాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):**

భారీ వర్షాలతో పలుచోట్ల చిక్కుకు పోయిన వారిని రెండు ఎన్డీఆర్‌ఎఫ్, ఆరు ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు కాపాడాయి. జిల్లాలో 14 ఆపరేషన్లు నిర్వహించి 775 మందిని కాపాడాయి. రాజంపేట మండల కేంద్రానికి చెందిన ఇప్పకాయల వినయ్‌కుమార్(28) ఇంటి గోడ కూలి మృతిచెందారు. అతను గుండారంపల్లె దవాఖానాలో వైద్యుడిగా పని చేస్తున్నారు. తన ఇంట్లోకి నీళ్లు రావడంతో.. రంధ్రం చేస్తుండగా గోడకూలి పైన పడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. బీబీపేట జనగామ గ్రామానికి చెందిన కప్పెర రాజిరెడ్డి(60) బుధవారం సాయంత్రం ఎడ్లకట్టవాగులో గల్లంతయ్యారు. గురువారం ఆయన మృతదేహాన్ని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం వెలికితీశారు. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామంలోని ఎడ్లకట్ట వాగులో ఓ వ్యక్తి గల్లంతయ్యారు. ఇదే వాగులో కారులో వెళ్తున్న తండ్రీకొడుకులు వరదలో చిక్కుకున్నారు. వారిని కాపాడటానికి ప్రయత్నిస్తుండగా మధ్యలోనే కొట్టుకుపోయారు. కొద్దిదూరం వెళ్లాక చెట్టును పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డారు. జిల్లావ్యాప్తంగా 50కి పైగా పశువులు మృత్యువాతపడ్డాయి. కుండపోత వర్షాలతో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. శ్రీరామసాగర్, స్వర్ణ ప్రాజెక్టుల నుంచి ఒకేసారి వరద నీరు దిగువకు వదలటంతో నిర్మల్ పట్టణంలోని జీఎన్‌ఆర్ కాలనీ, ఇందిరానగర్, బోయవాడ, నటరాజ్‌నగర్, భాగ్యనగర్, ప్రియదర్శినీ నగర్, శాంతినగర్ కాలనీల్లోకి భారీగా వరద వచ్చి చేరింది. ప్రధాన వాణిజ్య ప్రాంతమైన శివాజీచౌక్‌లో భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలను పోలీసులు దారిమళ్లించారు.

## కాళేశ్వరం వద్ద పోటెత్తిన గోదావరి పుష్కర ఘాట్లపై నుంచి వరద ప్రవాహం

పెద్దపల్లి,ఆగస్ట్29(సమయజ్యోతి ):

భారీ వర్షాలకు మరోసారి గోదావరిలోకి వరద పోటెత్తింది. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక్కడ వరద మొదటి ప్రమాదకర హెచ్చరిక స్థాయిని దాటింది. కాళేశ్వరంలో జ్ఞాన సరస్వతి, పుష్కర ఘాట్ల మెట్ల పైనుంచి వరద ప్రవహిస్తోంది. గోదావరి పరివాహక సమీప గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. మహదేవపూర్ మండలంలో పంట భూముల్లోకి నీరు చేరింది. అన్నారం, చంద్రుపల్లి, నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల, బలిజాపూర్ గోదావరి పరివాహక ప్రాంతాల్లోని వాగులు ఉప్పొంగడంతో వందల ఎకరాల పత్తి పంట నీట మునిగింది. రెండోసారి పత్తి పంటనష్టంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి 9,71,880 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో 85 గేట్లు- ఎత్తి 9,71,880 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

## నగరంలో జంటజలాశయాలకు పోటెత్తిన వరద

### గేట్లు ఎత్తడంతో మూసీలోకి భారీగా వరదనీరు

### పలు మార్గాల్లో రాకపోకలు నిలిపివేత

హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

తెలంగాణ రాష్ట్రంలో.. కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో మూసీకి వరద పోటెత్తింది. ఉస్మాన్ సాగర్ 8 గేట్లు- ఎత్తి 4100 క్యూసెక్కుల నీటిని, హిమాయత్ సాగర్ 3 గేట్లు- ఎత్తి 2300 క్యూసెక్కుల నీటిని మూసీలోకి విడుదల చేసినట్లు- అధికారులు తెలిపారు. నీటిని విడుదల చేయడంతో బాపుఘాట్, అత్తాపూర్, పురానాపూల్, చాదర్ఘాట్, మూసారంబాగ్ వద్ద వరద తీవ్రత పెరిగింది. దీంతో మూసి పరివాహక ప్రాంతాల ప్రజలను జీహెచ్ఎంసీ అప్రమత్తం చేసింది. జంట జలాశయాల గేట్లు- ఎత్తడంతో జియాగూడ 100 ఫీట్ రోడ్డుపై భారీగా వరద నీరు చేరింది. దీంతో రోడ్డును అధికారులు మూసివేశారు. జియాగూడ పురానాపూల్ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో పురానాపూల్ నుంచి హైకోర్టుకు వెళ్లే వాహనాలను కార్వాన్ నుంచి దారి మళ్లించారు. కాగా, మూసారాంబాగ్ బ్రిడ్జ్‌పై కూడా.. మూసి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బ్రిడ్జిని మూసివేశారు. వరద ధాటికి బ్రిడ్జ్ పిల్లర్లు పూర్తిగా డ్యామేజ్ అయినట్లు- అధికారులు తెలుపుతున్నారు. అంబర్‌పేట్, దిల్‌షుక్‌నగర్ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మంచిరేవుల వద్ద కూడా మూసీ ఉధృతితో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును మూసి వేశారు. దీంతో ఈ ప్రాంతంలో వహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## ర్యాష్ డ్రైవింగ్‌తో ఇద్దరి మృతి

### కేసులో టీవీ నటుడు లోబోకు ఏడాది జైలు

జనగామ,ఆగస్ట్29(సమయజ్యోతి ):

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతితోపాటు- పలువురు గాయపడటానికి కారణమైన టీవీ నటుడు ఖయూమ్ అలియాస్ లోబోకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ జనగామ కోర్టు తీర్పునిచ్చింది. జనగామ జిల్లా రఘునాథపల్లి పోలీసుల కథనం ప్రకారం.. 2018 మే 21న ఓ టీవీ ఛానల్ తరపున వీడియో చిత్రీకరణ కోసం లోబో బృందం రామప్ప, లక్నవరం, భద్రకాళి చెరువు, వేయిస్తంభాల ఆలయం తదితర ప్రాంతాల్లో పర్యటించింది. అనంతరం లోబో స్వయంగా కారు నడుపుతూ వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా.. రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద ఎదురుగా వచ్చిన ఆటోను ఢీకొట్టారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఖిలాషాపురం గ్రామానికి చెందిన మేడె కుమార్, పెంబర్తి మణెమ్మలు తీవ్ర గాయాలతో మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. కారు కూడా బోల్తా పడటంతో లోబోతో పాటు- బృంద సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో రఘునాథపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరి మృతికి కారణమైన లోబోకు ఏడాది జైలు శిక్షతో పాటు- రూ.12,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు- పోలీసులు వివరించారు.

## తహసిల్దార్ బండి నాగేశ్వర్ రావు ఇంటిపై ఎసిబి దాడి

### సోదాల్లో భారీగా నడదు, నగలు పట్టుబడినట్లు సమాచారం

వరంగల్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

వరంగల్ జిల్లా ఖిలావరంగల్ తహసిల్దార్ బండి నాగేశ్వర్ రావు ఇంటిపై అవినీతి నిరోధక శాఖ ఏసీబీ అధికారులు దాడులు చేశారు. హనుమకొండ ప్రశాంత్ నగర్ లోని ఆయన ఇంటిపై వరంగల్ ఏసీబీ అధికారులు ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. తహసిల్దార్ నాగేశ్వరరావు సొంత జిల్లా ఖమ్మంలో సైతం ఏసీబీ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బండి నాగేశ్వర్ రావు గతంలో ధర్మసాగర్, కాజీపేట, హసన్ పర్తి మండలాల్లో తహసిల్దారుగా పనిచేశారు. ఆ సమయంలో ఆయనపై ఆరోపణలు వచ్చినట్లు- తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టినట్లు తెలిసింది. సోదాల్లో భారీగా నగలు పట్టుబడినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కాళేశ్వరం నివేదికలో చర్చకురావాలి: బీర్ల ఐలయ్య

హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

కాళేశ్వరం కమిటి నివేదికను అసెంబ్లీలో పెడతామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీకి రావాలని, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలకు కెసిఆర్ సమాధానం చెప్పుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఐలయ్య మీడియాతో మాట్లాడుతూ..కెసిఆర్ సభలో మాట్లాడతానంటే తమ సమయం కూడా ఇస్తామని, బిసి రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలియజేశారు. మంచి పాలన అందిస్తున్నందుకు మమ్మల్ని తిడతారా? అని ఐలయ్య ప్రశ్నించారు.

## కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం

### అనుమతి కోరుతూ స్పీకర్‌కు బిఆర్ఎస్ వినతిపత్రం

హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

అసెంబ్లీలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. నేటి నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ద్వారా వివరించే అవకాశాన్ని బీఆర్ఎస్ఎల్పీకి కల్పించాలని స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో అసెంబ్లీలో బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయ కార్యదర్శి ఎం రమేష్ కుమార్ రెడ్డి ఉన్నారు.

## సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తాం సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

సూర్యాపేట,ఆగస్ట్29(సమయజ్యోతి ):

అసెంబ్లీ సమావేశంలో తమ సమస్యలను లేవనెత్తాలని ప్రజలు బీఆర్ఎస్ తలుపు తడుతున్నారు అని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తెలిపారు. తప్పకుండా ప్రజా సమస్యలను అసెంబ్లీలో లెవనేత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగులు భృతి కోసం, నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం, విద్యార్థినులు స్కూటీ-కోసం, రైతులు రుణమాఫీ, రైతు భరోసా, యూరియా, కరెంటు- కోతలపై మమ్మల్ని అడగమని అంటు-న్నారు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వరదలపై ప్రభుత్వానికి సోయి లేదు. సీఎం పాత పద్ధతుల్లో రోత మాటలు.. మంత్రులకు రివ్యూ చేయాలనే సోయి లేదు. గోదావరి, కృష్ణాలో వందలాది టీ-ఎంసీల నీరు సముద్రంలో కలుస్తుందని జగదీశ్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఉదయసముద్రంలో నీరు లేదు.. జిల్లా మంత్రి కోమటిరెడ్డికి సోయి లేదు. ఓ వైపు వర్షాలు, మరోవైపు యూరియా కోసం రైతులు పడిగాపులు. కాళేశ్వరం నివేదిక అసెంబ్లీలో పెడితే మాకేం ఇబ్బంది లేదు. అసలు నివేదికను బయట పెట్టాలని మేము డిమాండ్ చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక సంస్థల పేరుతో కాంగ్రెస్ మోసం బయట పడింది. మరో డ్రామాకు తెర తీస్తుంది. హైకోర్టు మూడు నెలల -టైమ్ ఇస్తే, రెండు నెలలు నిద్రపోయి, ఇప్పుడు హడావుడి చేస్తుంది. ఎన్నికల కమిషన్ దుర్మార్గంగా వ్యవహరిస్తుంది. ఓ వైపు వర్షాలు, వరదలు వస్తుంటే సమగ్రంగా లేని ఓటర్ లిస్టులు పెట్టి ప్రజల్ని గందరగోళానికి గురి చేస్తున్నారు. అన్ని ఓటర్ లిస్టులను గ్రామాల్లో బహిరంగపర్చాలి. అందరి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి అని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో మరోమారు భారీ వర్షం

హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి )

:హైదరాబాద్‌లో మళ్లీ వర్షం దంచికొట్టింది. శుక్రవారం సాయంత్రం పలు చోట్లు- భారీ వర్షం కురిసింది. నగరంలోని సికింద్రాబాద్, బేగంపేట్, అమీర్ పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, మణికొండ, కూకట్ పల్లి తదితర ప్రాంతాల్లో వాన పడుతోంది. దీంతో లోతట్టు- ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. పలు చోట్ల రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గత మూడు నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుండపోత వానలకు కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, తదితర జిల్లాలు ఆగమాగమయ్యాయి. వరద ప్రవాహంలో పలు గ్రామాలు, తండాలు నీట మునిగిపోయాయి. దీంతో చాలా మంది నీరాశ్రులయ్యారు.

## 2లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

### భారీ వర్షాలపై అధికారులన నివేదికలు

హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి )

:తెలంగాణలో భారీ వర్షాల కారణంగా 270 మండలాలు, 2,463 గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. వర్షాలతో వరి, పత్తి, మొక్కజొన్న, టమాట, కంది పంటలకు నష్టం వాటిల్లినట్లు- పేర్కొంది. మొత్తం 2,20,443 ఎకరాల్లో పంటలు దెబ్బతినట్లు- ప్రాథమికంగా అంచనా వేశామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లాలవారీగా పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు- వెల్లడించారు. నివేదిక ప్రకారం.. 1,09,626 ఎకరాల్లో వరి, 60,080 ఎకరాల్లో పత్తి, 6,751 ఎకరాల్లో సోయాబీన్, 639 ఎకరాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

## దెబ్బతిన్న పంచాయితీరాజ్ రోడ్ల పునరుద్ధరణ

### -తాత్కాలిక మరమ్మత్తుల కోసం రూ.22.71 కోట్లు-శాశ్వత మరమ్మత్తుల కోసం రూ.352 కోట్లు అవసరం

### -పంచాయితీ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

రాష్ట్రంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంచాయతీరాజ్ రహదారులను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు రహదారులు దెబ్బతిన్న నేపథ్యంలో సీతక్క పంచాయతీరాజ్ ఇఎన్‌సి ఎన్.అశోక్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దెబ్బతిన్న రహదారుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 1291 ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నట్లు- ఇంజినీరింగ్ అధికారులు మంత్రికి నివేదించారు. వీటి తాత్కాలిక మరమ్మత్తుల కోసం రూ.22.71 కోట్లు-, శాశ్వత మరమ్మత్తుల కోసం రూ.352 కోట్లు-, మొత్తంగా గ్రామీణ రహదారుల పునరుద్ధరణకు రూ.374.71 కోట్లు- అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్లు- తెలిపారు. మొత్తం 22 గ్రామాలకు రాకపోకలు దెబ్బతినగా, వాటిలో 14 గ్రామాలకు తాత్కాలికంగా రహదారులను పునరుద్ధరించామని వెల్లడించారు. మిగిలిన గ్రామాలకు పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నట్లు- ఇఎన్‌సి అశోక్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా వీలైనంత త్వరగా రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్న గ్రామాలకు యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. వర్షాలకు తడిచి కూలే ప్రమాదం ఉన్న పంచాయతీరాజ్ భవనాలను తక్షణం ఖాళీ చేయించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు వేగంగా చేపట్టాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## సిఎంను కలిసిన సందీప్ రెడ్డి వంగా

### పదిలక్షల చెక్కు విరాళంగా అందచేత

హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

టాలీవుడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా రూ.10 లక్షల విరాళాన్ని సీఎం సహాయనిధికి అందించారు. ఈ సందర్భంగా తన సొంత బ్యానర్ భద్రకాళి ప్రొడక్షన్స్ తరపున నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా, సందీప్ రెడ్డి వంగా పదిలక్షల చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. శనివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెక్కుని అందించారు సందీప్ రెడ్డి వంగా. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా ఎడతెరుపు లేని భారీ వర్షాల కారణంగా ఎంతోమంది నష్టపోయారు. అందువల్ల దర్శకుడు సందీప్ రెడ్డి ఈ సహాయం అందించినట్లు- సమాచారం.తెలుగులో అర్జున్ రెడ్డి సినిమాతో -టె-ండ్ సెట్ చేశాడు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. టాలీవుడ్ లో హిట్ పడగానే బాలీవుడ్ కి మకాం మార్చి అక్కడ కూడా కబీర్ సింగ్, యానిమల్ సినిమాలతో హిందీ ప్రేక్షకులను ఫిధా చేశాడు. ఈ క్రమంలోనే ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' అనౌన్స్ చేసి టాక్ అఫ్ ది ఇంటర్నేషనల్ గా మారాడు. స్పిరిట్ విషయానికి వస్తే.. ఇప్పటికే, ఈ మూవీ స్క్రిప్ట్ వర్క్ కూడా కంప్లీట్ చేసుకుంది. త్వరలో షూటింగ్ షురూ కానుంది. ఇందుకు సంబంధించిన సన్నాహాలు చకచకా జరుగుతున్నాయి. ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ప్రభాస్ ఫ్యాన్స్. త్వరలోనే షూటింగ్ అప్డేట్ వచ్చే అవకాశం ఉంది.



## పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అవకాశం

### బిఆర్ఎస్ వినతిపై ఆది శ్రీనివాస్ ఎద్దేవా

హైదరాబాద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

అసెంబ్లీలో కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి కోరడాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. గతంలో అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ శాసనసభా పక్షం అడిగితే పట్టించుకోలేదని ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పీసీ ఘోష్ కమిషన్‌పై అసెంబ్లీలో చర్చ జరిగితే వారి బండారం బయటపడుతుందని ఆ పార్టీ నేతలు భయపడు తున్నారని అన్నారు. కాళేశ్వరానికి కర్త, కర్మ, క్రియ తానేనని కేసీఆర్ చెప్పుకొన్నారు. అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి గొప్పలకు పోయారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ హయాంలో కట్టారు.. వారి హయాంలోనే కూలిపోయింది. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రజల ముందు ఉంచడానికి అసెంబ్లీలో చర్చకు పెడుతున్నాం. ఆ నివేదికను ఆపాలని భారత రాష్ట్ర సమితి హైకోర్టుకు వెళ్లి భంగపడింది. మేడిగడ్డ బ్యారేజీ కూలిపోవడంతో తెలంగాణ ప్రతిష్ఠ గంగలో కలిసిపోయింది. మామ, అల్లుడు నీటిపారుదలశాఖ మంత్రిగా ఉండి ఏం సాధించారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే ప్రజలు పట్టించుకోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన ఇంజినీర్ల వద్ద ఏసీబీ రూ.వందల కోట్లు- పట్టు-కుంది. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా మా ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తోంది. భారత రాష్ట్ర సమితి అసెంబ్లీలో అన్ని విషయాలు చెప్పుకోవచ్చని ఆది శ్రీనివాస్ అన్నారు.

## ఏడుపాయల వద్ద వరద ఉధృతి భక్తులు రాకుండా హెచ్చరికలు జారీ

మెదక్,ఆగస్ట్29(సమయజ్యోతి ):


ప్రముఖ దేవాలయం ఏడుపాయల టెంపుల్ వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆలయం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వరదనీరు దేవాలయం పైవరకు చేరుకుంది. వరద పొటెత్తడంతో దేవాలయం వైపు భక్తులు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కుండపోత వానలు పడుతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, నిజామాబాద్ తదితర జిల్లాల్లో వానలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కామారెడ్డి పట్టణం వరదల్లో చిక్కుకుంది. జిల్లాల్లోని పలు గ్రామాలు, తండాలను వరద ప్రవాహం ముంచెత్తింది. దీంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి వరదల్లో చిక్కుకున్నవారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

## అసెంబ్లీలో కాళేశ్వరంపైనే ప్రధాన చర్చ-కెసిఆర్ వస్తారా లేదా అన్నది అనుమానమే

హైదరాబద్,ఆగస్ట్29(సమయజ్యోతి ):

కాళేశ్వరంపై కమిషన్ నివేదికపై చర్చించడమే ప్రధాన అజెండాగా శనివారం నుంచి రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అత్యంత కీలకమైన అంశం కావడంతో.. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చ జరుగనున్నది. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నిర్ణయాలు తీసుకున్న తీరు.. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడంపై 16 నెలలపాటు- విచారణ జరిపిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్, జూలై 31న ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. కాళేశ్వరం నివేదికపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చ జరిగింది. అధికారులతో పాటు- బిఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేతలు బాధ్యులు అని పిసి ఘోష్ తేల్చడంతో అసెంబ్లీలో చర్చించి అందరి నిర్ణయాలు తీసుకున్న తర్వాత ముందుకెళ్తామని సిఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. తమకు పూర్తి నివేదిక అందిన తర్వాత అసెంబ్లీలోఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామంటూ ఇప్పటికే హరీష్‌రావు వెల్లడించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక ప్రభుత్వానికి అందినప్పటి నుంచే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఆ నివేదికపై అసెంబ్లీలో చర్చ జరుగనున్న నేపథ్యంలో ఇరుపక్షాల మధ్య వాడివేడిగా మాటల యుద్ధం జరిగే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ కేంద్రంగానే కాంగ్రెస్ ప్రధానంగా ఆరోపణలు చేస్తోంది.

# బీసీసీఐ అధ్యక్ష పదవికి రోజర్ బిన్నీ రాజీనామా



బీసీసీఐలో పెద్ద మార్పు జరిగింది. అధ్యక్షుడు రోజర్ బిన్నీ తన పదవికి రాజీనామా చేశారని వార్తలు వస్తున్నాయి. ఆయన స్థానంలో ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం. కొత్త అధ్యక్షుడు ఎన్నికయ్యే వరకు శుక్లా ఈ పదవిని నిర్వహించనున్నారు. రోజర్ బిన్నీ 2022లో సౌరవ్ గంగూలీ తర్వాత బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన జూలై 19న ఆయన 70 ఏళ్ల వసంతంలోకి అడుగుపెట్టారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం 70 ఏళ్లు దాటిన ఏ ఆఫీస్ బేరర్ అయినా.. ఈ పదవిలో కొనసాగలేరు. అందుకే బిన్నీ రాజీనామా చేసినట్లుగా సమాచారం. 65 ఏళ్ల రాజీవ్ శుక్లా 2020 నుంచి బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. సెప్టెంబర్‌లో జరిగే వార్షిక సమావేశంలో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అప్పటి వరకు శుక్లా బీసీసీఐ పనులను చూస్తారు. రాష్ట్ర యూనిట్లు కలిసి కొత్త అధ్యక్షుడిని నిర్ణయిస్తాయి. ఇటీవల జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి శుక్లా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో భారత జట్టుకు కొత్త స్పాన్సర్‌ను ఎంపిక చేయడం గురించి చర్చించారు. డ్రీమ్ 11 ఇప్పటి వరకు స్పాన్సర్‌గా ఉండేది, కానీ ఇప్పుడు వారు తప్పుకున్నారు. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. కానీ కొత్త స్పాన్సర్‌ను ఇంత తక్కువ సమయంలో కనుగొనడం కష్టమని అపెక్స్ కౌన్సిల్ చెప్పింది. టెండర్లు, చట్టపరమైన ప్రక్రియలు, సాంకేతిక అంశాలు పూర్తి చేయడానికి సమయం కావాలి. ఆసియా కప్ కోసం తాత్కాలిక స్పాన్సర్‌ను ఎంచుకోవడం లేదని.. 2027లో జరిగే వన్డే ప్రపంచకప్ వరకు రెండున్నర సంవత్సరాల పాటు భారత జట్టుకు స్పాన్సర్‌గా ఉండే సంస్థ కోసం చూస్తున్నట్లు తెలిపారు.



# సమీర్ రిజ్వి ఊచకోత..

యూపీ ప్రీమియర్ లీగ్ 2025లో సమీర్ రిజ్వి బ్యాట్ గర్జిస్తోంది. ఈ లీగ్‌లో కాన్పూర్ సూపర్‌స్టార్స్ జట్టుకు నాయకత్వం వహిస్తున్న సమీర్ మరోసారి సిక్స్‌లు, ఫోర్లు బాదాడు. ఈరోజు లక్నో ఫాల్కన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సమీర్ రిజ్వి కేవలం 32 బంతుల్లో అజేయంగా 76 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల విజయాన్ని అందించాడు. 163 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన కాన్పూర్ జట్టు సమీర్ మెరుపు బ్యాటింగ్ కారణంగా కేవలం 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది.బ్యాటింగ్‌కు దిగిన సమీర్ రిజ్వి ఆటను చాలా స్లోగా ప్రారంభించాడు. ఆ విధంగా మొదటి 15 బంతుల్లో కేవలం 12 పరుగులు మాత్రమే చేశాడు. కానీ, ఆ తర్వాత లక్నో బౌలర్లపై దాడి చేయడం ప్రారంభించిన సమీర్ రిజ్వి తరువాతి 17 బంతుల్లో 9 సిక్సర్లు బాదాడు. గొప్ప విషయం ఏమిటంటే చివరి 11 బంతుల్లో 7 సిక్సర్లు, 2 ఫోర్లు బాదాడు. సమీర్ రిజ్వి చివరి వరకు నాటౌట్‌గా నిలిచాడు. తన జట్టుకు విజయం అందించిన తర్వాతే తిరిగి వచ్చాడు.



# జాసన్ రాయ్ బీభత్సం..

హండ్రెడ్ లీగ్ 2025 ఇప్పుడు చివరి రౌండ్‌కు చేరుకుంది. ఈ సీజన్‌లో చివరి మ్యాచ్ ఆగస్టు 31న జరుగుతుంది. అంతకుముందు, సదరన్ బ్రేవ్ వర్సెస్ వెల్ష్ ఫైర్ మధ్య జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో, ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సహ యజమాని అయిన %+వీ=% గ్రూప్ జట్టు సదరన్ బ్రేవ్ విజయంతో ఈ లీగ్‌కు వీడ్కోలు పలికింది. ఇంగ్లాండ్ ఓపెనింగ్ బ్యాటర్ ఈ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో నిషేధించబడిన ఈ ఆటగాడు 11 బౌండరీలు కొట్టడం ద్వారా తన జట్టుకు అద్భుతమైన విజయాన్ని అందించాడు. ఈ సమయంలో, వెల్ష్ ఫైర్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ టామ్ కోహ్లర్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ కూడా జట్టుకు సహాయం చేయలేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఇంగ్లాండ్ జట్టుకు దూరంగా ఉన్న బ్యాటర్ జాసన్ రాయ్, ది హండ్రెడ్ 2025 చివరి లీగ్ మ్యాచ్‌లో తుఫాన్ హాఫ్ సెంచరీ సాధించాడు. వెల్ష్ ఫైర్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 39 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 70 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్ సహాయంతో, సదరన్ బ్రేవ్ 100 బంతుల్లో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. ఈ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆడిన జాసన్ రాయ్ చేసిన తొలి అర్ధ సెంచరీ ఇది. అతనితో పాటు, లూయిస్ డు ప్లూయ్ 21 బంతుల్లో 30 పరుగులు చేశాడు. వెల్ష్ ఫైర్ తరపున డేవిడ్ పేన్, రిలే మెరెడిత్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. లక్ష్యాన్ని ఛేదించే సమయంలో వెల్ష్ ఫైర్ చాలా పేలవమైన ఆరంభాన్ని పొందింది.


# పీవీ సింధు అద్భుత విజయం

## క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సింధు



బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ షట్లర్, మాజీ ఛాంపియన్ పీవీ సింధు దుమ్మురేపుతోంది. గత కొన్ని నెలలుగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడిన సింధు.. ప్రతిష్టాత్మక టోర్నీలో అద్వితీయమైన ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 21-19, 21-15 తేడాతో ప్రపంచ రెండో ర్యాంకర్, చైనా షట్లర్ వాంగ్ జి యిపై విజయం సాధించింది. 48 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో పూర్తి ఆధిపత్యం చెలాయించిన సింధు వరుస గేమ్‌లను కైవసం చేసుకుంది. ఈ గెలుపుతో వాంగ్‌పై తన ముఖా ముఖి రికార్డ్‌ను 3-2తో మెరుగుపరుచుకుంది. తొలి గేమ్‌లో ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైనా.. సింధు తన అనుభవంతో గేమ్ పాయింట్ సాధించింది. శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు ప్రారంభమయ్యే క్వార్టర్ ఫైనల్లో ఇండోనేషియా ప్లేయర్ పుత్రి కుసుమవర్ధనితో సింధు తలపడనుంది. 38వ ర్యాంకర్ అయిన పుత్రి కుసమవర్ధనితో 12వ ర్యాంకర్ పీవీ సింధు ఇప్పటి వరకు ఒకే ఒక్క మ్యాచ్ ఆడి గెలిచింది. గతేడాది జరిగిన ఉబెర్ కప్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో సింధు 21-15, 21-17 తేడాతో పుత్రి కుసుమ వర్ధానిపై విజయం సాధించింది. ఈ రికార్డ్ ప్రకారం సింధు సునాయసంగా సెమీఫైనల్ చేరడం ఖాయంగా కనిపిస్తోంది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో సింధుకు మెరుగైన రికార్డ్ ఉంది. 2019లో స్వర్ణ పతకం సాధించిన సింధు.. 2017, 2018 టోర్నీలో రజత పతకాలు అందుకుంది. 2013, 2014లో క్యాంస్య పతకాలు సాధించింది. ఈ సారి తిరిగి స్వర్ణం సాధించాలనే పట్టుదలతో ఉంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ 19-21, 21-15,21-17 తేడాతో చైనాకు చెందిన లియాంగ్, వాంగ్ జోడీని మట్టికరిపించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ ప్రపంచ ఐదో ర్యాంక్ జంటకు షాకిచ్చింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ పిల-తనీషా క్రాస్టో జోడీ ప్రపంచ ఐదో ర్యాంక్ జంటకు షాకిచ్చింది. ప్రిక్వార్టర్స్‌లో భారత ద్వయం ధ్రువ్-పిల 19-21, 21-12, 21-15తో టాంగ్ చున్-యింగ్ సూట్(హాంకాంగ్) జంటపై గెలుపొందింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో హెచ్ఎస్ ప్రణయ్ 8-21, 21-17, 21-23తో ఆండర్స్ ఆంథోన్సెన్(డెన్మార్క్) చేతిలో పరాజయం చవిచూశాడు.

# స్వస్తిక్ చికారా అద్భుతమైన ప్రదర్శన



ఉత్తర ప్రదేశ్ ప్రీమియర్ లీగ్ 2025 20వ మ్యాచ్ భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగింది. ఇందులో లక్నో ఫాల్కన్స్ మీరట్ మావెరిక్స్‌తో తలపడింది. ఈ మ్యాచ్‌లో, రింకు సింగ్ కెప్టెన్సీలో మీరట్ మావెరిక్స్ భారీ విజయాన్ని సాధించింది. మరోవైపు, లక్నో ఫాల్కన్స్ జట్టు పూర్తిగా విఫలమైంది. ఆ జట్టు బౌలర్లు ప్రత్యేకంగా ఏమీ చేయలేకపోయారు. రింకు సింగ్ జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. అది సరైనదని నిరూపితమైంది. స్వస్తిక్ చికారా జట్టుకు అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అతను 31 బంతులు ఎదుర్కొని 55 పరుగులు చేశాడు. ఇందులో 4 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. ఆ తర్వాత, రుతురాజ్, రింకు సింగ్ మైదానంలో ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించారు. రింకు సింగ్ 27 బంతుల్లో 211.11 స్ట్రైక్ రేట్‌తో 57 పరుగులు చేశాడు. అతను తన ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. మరోవైపు, రుతురాజ్ శర్మ 37 బంతుల్లో 74 పరుగులతో అజేయంగా ఇన్నింగ్స్ ఆడాడు. రుతురాజ్ శర్మ తన ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు బాదాడు. ఆ తర్వాత, హృతిక్ వాట్స్ చివరి ఓవర్‌లో తుఫాను ఇన్నింగ్స్ ఆడి జట్టును భారీ స్కోరుకు తీసుకెళ్లాడు. హృతిక్ వాట్స్ 437.50 స్ట్రైక్ రేట్‌తో కేవలం 8 బంతుల్లో 35 పరుగులు చేశాడు. ఈ సమయంలో, అతను 2 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. దీని కారణంగా రింకు జట్టు 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేయగలిగింది. ఈ ఇన్నింగ్స్‌లో, మీరట్ మావెరిక్స్ జట్టు మొత్తం 17 సిక్సర్లు బాదింది. 234 పరుగులకు ప్రతిస్పందనగా, లక్నో ఫాల్కన్స్ 18.2 ఓవర్లలో 140 పరుగులు చేసి ఆలౌట్ అయింది. లక్నో ఫాల్కన్స్ తరపున సమీర్ చౌదరి అత్యధికంగా 46 పరుగులు చేశాడు. అతను తప్ప, ఏ బ్యాటర్ కూడా 30 పరుగుల మార్కును చేరుకోలేకపోయాడు. మరోవైపు, మీరట్ మావెరిక్స్ తరపున ఈ ఇన్నింగ్స్‌లో యష్ గార్గ్, జీషన్ అన్సారీ గరిష్ఠంగా 3-3 వికెట్లు తీశారు. అదే సమయంలో, విజయ్ కుమార్, కార్తీక్ త్యాగి తలా 2-2 బ్యాట్స్‌మెన్‌లను తీసుకున్నారు. దీని కారణంగా ఆ జట్టు 93 పరుగుల తేడాతో విజయం సాధించగలిగింది.

# విశాల్, ధన్సిక నిశ్చితార్థం.. పెళ్లి ఎప్పుడంటే?

**కోలీవుడ్ నటుడు విశాల్, నటి సాయి ధన్సికల నిశ్చితార్థం**
**విశాల్ పుట్టినరోజు సందర్భంగా చెన్నైలో వేడుక**
**కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల హాజరు**
**నడిగర్ సంఘం భవన నిర్మాణం తర్వాతే వివాహం**
**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఎంగేజ్‌మెంట్ ఫొటోలు**

కోలీవుడ్ యాక్షన్ హీరో, విలక్షణ నటుడు విశాల్ తన పుట్టినరోజున అభిమానులకు తీపి కబురు అందించారు. తన ప్రేయసి, ప్రముఖ నటి సాయి ధన్సికతో ఆయన నిశ్చితార్థం శుక్రవారం ఘనంగా జరిగింది. చెన్నైలోని విశాల్ నివాసంలో జరిగిన ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం ఈ జంట ఉంగరాలు మార్చుకుంటున్న ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. గత మే నెలలోనే తాము ప్రేమలో ఉన్న విషయాన్ని విశాల్, ధన్సిక అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి, విశాల్ పుట్టినరోజైన ఈరోజే వీరి వివాహం జరగాల్సి ఉంది. అయితే, విశాల్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న నడిగర్ సంఘం (తమిళ నటీనటుల సంఘం) భవన నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో పెళ్లిని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని విశాల్ గతంలో ప్రకటించారు. ఇక నటి సాయి ధన్సిక విషయానికొస్తే, జూనియర్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి తన ప్రతిభతో ఎదిగారు. సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'కబాలి' చిత్రంలో ఆయన కూతురి పాత్రలో అద్భుతంగా నటించి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా తర్వాత ఆమెకు తమిళంతో పాటు తెలుగులోనూ వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఇద్దరూ తమ కెరీర్‌లో బిజీగా ఉండగా, త్వరలోనే వీరి పెళ్లి తేదీని ప్రకటించే అవకాశం ఉంది.



## నా రెండు ప్రపంచాలు కలిశాయి: నిహారిక ఎమోషనల్ పోస్ట్

నటిగా, నిర్మాతగా రెండు పాత్రల్లో బిజీగా ఉన్న
నిహారిక కొణిదెల
తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఎమోషనల్ పోస్ట్
ఒకే రోజు రియాలిటీ షోలో నటిగా, ఆఫీసులో నిర్మాతగా బాధ్యతలు- నటన తన ప్యాషన్ అయితే, నిర్మాణం తన ఎదుగుదలకు కారణమని వెల్లడి
సంగీత్ శోభన్‌తో
రెండో సినిమా నిర్మిస్తున్న
మెగా డాటర్

మెగా డాటర్ నిహారిక కొణిదెల ఒకేసారి రెండు పడవలపై విజయ వంతంగా ప్రయాణం చేస్తున్నారు. ఒకవైపు నిర్మాతగా రాణిస్తూనే, మరోవైపు నటిగా కెమెరా ముందుకొస్తున్నారు. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఓ పోస్ట్ ద్వారా.. ఈ రెండు పాత్రలను తాను ఎంతగా ఆస్వాదిస్తున్నారో తెలియ జేశారు. ఒకే రోజు నటిగా, నిర్మాతగా తన రెండు ప్రపంచాలు ఒకేచోట కలిశాయని, ఆ క్షణం తన మనసు ఆనందంతో నిండి పోయిందని ఆమె పేర్కొ న్నారు. వివరాల్లోకి వెళితే, నిహారిక తాజాగా ఓ రియాలిటీ షోలో గెస్ట్‌గా పాల్గొన్నారు. నటిగా ఆ షోలో డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. ఆ కార్యక్రమం షూటింగ్ జరిగిన భవనానికి పక్కనే ఆమె నిర్మాణ సంస్థ 'ది ఎలిఫెంట్ పిక్చర్' ఆఫీసు ఉంది. షో పూర్తయిన వెంటనే, ఆమె నేరుగా తన ఆఫీసుకు వెళ్లి నిర్మాతగా నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఇది తనను ఎంతగానో సంతోషపెట్టిందని నిహారిక తన పోస్ట్‌లో తెలిపారు. "నటన నా ప్యాషన్ అయితే, నిర్మాతగా మారడం నా ఎదుగుదలకు కారణమైంది. ఈ రెండింటిలో ఏది ఎక్కువ ఇష్టమని చాలామంది అడుగుతుంటారు. నిజం చెప్పాలంటే నేను ఒకదాన్ని ఎంచుకోలేను. ఈ విషయం నిన్న స్పష్టంగా రుజువైంది. ఒకేరోజు కెమెరా ముందు నటిగా, ఆ పక్కనే ఉన్న ఆఫీసులో నిర్మాతగా కనిపించడం నా ప్రయాణాన్ని గుర్తుచేసింది" అని నిహారిక తన భావాలను పంచుకున్నారు. నిర్మాతగా తన తొలి చిత్రం 'కమిటీ కుర్రాళ్ళు'తో మంచి విజయాన్ని అందుకున్న నిహారిక, ప్రస్తుతం 'మ్యాడ్' ఫేమ్ సంగీత్ శోభన్‌తో తన రెండో చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. నిహారిక పోస్ట్ చూసిన నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అలాగే, తన రెండో సినిమాలో నిహారిక కూడా కీలక పాత్రలో నటిస్తుండవచ్చని కొందరు గెస్ చేస్తున్నారు.







# జాన్వీ మూవీ సన్నీ సంస్కార్ కీ తులసి కుమారి

జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న చిత్రం 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'. జాన్వీ లేటెస్ట్ చిత్రమిది. ఓ యువ జోడీ ప్రేమ ప్రయాణం నేపథ్యంలో శశాంక్ ఖైతాన్ తెరకెక్కిస్తున్నారు. దసర కానుకగా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానున్నట్లు- టీజర్ ఆధారంగా అర్థమవుతోంది.




# అఖండ-2 విడుదల మరింత ఆలస్యం

విజయవంతమైన 'అఖండ' చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న 'అఖండ 2: తాండవం' విడుదల వాయిదా పడింది. నిర్మాణానంతర పనుల కోసం అదనపు సమయం కేటాయించాల్సి రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా నిర్మాణ సంస్థలు ఓ ప్రకటనలో తెలిపాయి. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. సంయుక్తా మేనన్ కథానాయిక. ఎం.తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న సినిమాని విడుదల చేయాలని ఇదివరకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, సినిమా స్థాయిని దృష్టిలో ఉంచుకుని మరింత నాణ్యమైన రీరికార్డింగ్, విజువల్ ఎఫెక్ట్స్ హంగుల్ని జోడించడం కోసం సినిమా విడుదలని వాయిదా వేస్తున్నట్టు- నిర్మాణ వర్గాలు తెలిపాయి. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నాయి. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ అనుభూతిని పంచడం కోసం విజువల్స్ పరంగా, స్కేల్ పరంగా రాజీపడకుండా మా బృందం పనిచేస్తోంది. 'అఖండ'కి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.



# నాగ్ బర్త్‌డే స్పెషల్ మ్యాష్ అప్ విడుదల

టాలీవుడ్‌లో ఎంతోమంది హీరోలున్నప్పటికీ గ్రీకువీరుడు, మన్మధుడు, కింగ్ అనగానే గుర్తొచ్చేది మాత్రం నాగార్జుననే. నటనలో శివ నుంచి మొదలు ఇక తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. 66 ఏళ్ల వయసులోనూ భిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ వరుస సినిమాలతో అలరిస్తున్నాడీ హీరో. శుక్రవారం అక్కినేని హీరో పుట్టినరోజు సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ఓ స్పెషల్ మ్యాష్‌అప్ వీడియోను విడుదల చేసింది. ఇప్పటి వరకూ ఆయన చేసిన సినిమాల్లోని కొన్ని పాత్రల ఫేమస్ డైలాగులతో చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'ఈ ఫీల్డ్‌లో కొత్తగా ట్రై చేయాలంటే నేనే' అంటూ నాగార్జున డైలాగ్ ఆకట్టుకుంటోంది. నాగ్ బర్త్ డే సందర్భంగా అయనకు సినీ రాజకీయ ప్రముఖులు, అభిమానులు విషెస్ తెలిపారు.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685